# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in


విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 141 | పేజీలు : 08 | శుక్రవారం | 29-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## ఎకరా 237 కోట్లు!

- సరికొత్త చరిత్ర... రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు!
- టీజీఐఐసీ వేలంలో రికార్డు ధర పలికిన ధర
- పాన్ మక్తాలోని సర్వే నెంబర్‌లోని 6 ఎకరాల 29 గుంటలకు వేలం
- వేలంలో భూమిని దక్కించుకున్న గౌర వెంచర్స్



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో భూమి మరోసారి రికార్డు ధర పలికింది. టీజీఐఐసీ వేలంలో

## సీఎం పదవికి రాజీనామా చేశాను...

సిద్ధరామయ్య భావోద్వేగ ప్రకటన

- కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా
- అధిష్ఠానం ఆదేశాల మేరకే ఈ నిర్ణయమన్న సిద్ధూ
- గవర్నర్ కార్యాలయంలో రాజీనామా పత్రం సమర్పణ
- సీఎంగా అవకాశం ఇచ్చిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు
- పొరపాటున రాజకీయాల్లోకి వచ్చానంటూ భావోద్వేగం



హైదరాబాద్ పల్స్,డెస్క్

కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా

# ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్

పౌరుల సమగ్ర సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు రూపొందించాలన్న సీఎం

ఎంత లబ్ధి జరుగుతుందో తెలిసేలా కార్డులు ఉండాలని సూచన

ఆధార్ తరహాలో నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్న రేవంత్

సీఎం కీలక సూచనలు



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

పౌరుల సమగ్ర సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు రూపొందించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎవరికి ఎంత లబ్ధి జరుగుతుందో తెలిసేలా ఈ కార్డులు ఉండాలన్నారు. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటా సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలనూ సేకరించాలన్నారు.రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డు'ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలన్నారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు.ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డులో ఆరోగ్యశ్రీ,

## తడిసిన ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లిస్తాం



హైదరాబాద్ పల్స్,హనుమకొండ

: 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని వరి రైతులకు మాటిస్తున్నానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. 8.5 లక్షల మంది రైతులకు రూ. 8,400 కోట్లు నగదు చెల్లించామన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలిస్తామని వెల్లడించారు. తడిసిన ధాన్యానికి సైతం కనీస మద్దతు ధర చెల్లిస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. గురువారం హనుమకొండలో పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి మంత్రి

## ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే



హైదరాబాద్ పల్స్,నల్గొండ

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి మాట్లాడారు. బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక

## ఒక్కో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు.. ఇందిరమ్మ ఇండ్లకు సమానం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్‌పై స్పందించిన కేటీఆర్

20 లక్షల ఇళ్లు నిర్మించాకే ఓట్లు అడుగుతామని పొంగులేటి అన్నారన్న కేటీఆర్

శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలని డిమాండ్

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు వీలుగా ప్రభుత్వాలు అర్హులకు ఇళ్లను కేటాయిస్తున్నాయి. బీఆర్ఎస్ హయంలో 'డబుల్ బెడ్‌రూం' కేటాయింపులు చేయగా.. కాంగ్రెస్ 'ఇందిరమ్మ ఇళ్లు' పేరుతో పేదలకు పక్కా గృహాలు నిర్మిస్తోంది. బుధవారం గ్రేటర్ హైదరాబాద్‌లో ఇళ్ల కోసం స్థలాల పరిశీలన అనంతరం మంత్రులు పొన్నం, అజారుద్దీన్?, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ ఓండ్డితో కలిసి రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సచివాలయంలో సమీక్ష



## ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం కానుంది

- ఫ్యూచర్ సిటీలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పర్యటన
- ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయ భవనం నిర్మాణ పనుల పరిశీలన
- స్కిల్ యూనివర్సిటీ పనుల పరోగతి పరిశీలించిన మంత్రులు



## బీజేపీలో కీలక మార్పులు..

నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు

- ఢిల్లీకి హర్ష్ మల్హోత్రా, పంజాబ్‌కు కేవల్ సింగ్ ధిల్లాన్ నియామకం
- వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కీలక మార్పు
- హర్యానాకు డాక్టర్ అర్చనా గుప్తా, త్రిపురకు అభిషేక్ దేబ్రాయ్ సారథ్యం
- జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ బాధ్యతల తర్వాత ఇదే తొలి పెద్ద పునర్వ్యవస్థీకరణ



హైదరాబాద్ పల్స్,డెస్క్

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధిష్ఠానం పలు రాష్ట్రాల్లో పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు చేసింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, త్రిపుర రాష్ట్రాలకు కొత్త పార్టీ అధ్యక్షులను నియమిస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు తక్షణమే



## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

నటసార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు(ఎన్టీఆర్) భారీ కాంస్య విగ్రహం హైదరాబాద్ అమీర్‌పేటలోని మైత్రీవనం చౌరస్తాలో కొలువుదీరింది. నూతనంగా ఏర్పాటుచేసిన 23 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఘనంగా

## మద్యం కుంభకోణం కేసు

ఏడున్నర గంటల పాటు విజయసాయిరెడ్డి విచారణ

- బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో విచారించిన అధికారులు
- మద్యం పాలసీ కేసుతో తనకు సంబంధం లేదన్న విజయసాయిరెడ్డి
- రాజ్ కెసిరెడ్డి పేరు తప్ప తాను ఎవరి పేరు చెప్పలేదని వెల్లడి



హైదరాబాద్ పల్స్,డెస్క్

ఏపీ మద్యం కుంభకోణం కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఈడీ సుమారు ఏడున్నర గంటల పాటు విచారించింది. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారులు ఆయనను విచారించారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మద్యం పాలసీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తాను ఎవరి పేర్లను అధికారులకు చెప్పలేదని వెల్లడించారు.మద్యం కుంభకోణానికి సంబంధించిన విషయాలన్నీ రాజ్ కెసిరెడ్డికి మాత్రమే తెలుసని చెప్పానని వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా

## లోకేష్ ప్రతిపాదనను ఆమోదిస్తున్నాం

: 'మహానాడు'లో చంద్రబాబు

- "జై కార్యకర్త" నినాదంతో ముగిసిన టీడీపీ మహానాడు.. 24.5 లక్షల మంది హాజరు
- గొడ్డలి పార్టీకి గంజాయి, బ్లేడ్, పేటీఎం బ్యాచ్‌లు ఉన్నాయంటూ చంద్రబాబు తీవ్ర ఆరోపణలు
- గతంలో పరదాల పాలన, ఇప్పుడు ప్రజల మధ్య పాలన సాగిస్తున్నామని వెల్లడి
- పార్టీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చారిత్రక ప్రకటన



హైదరాబాద్ పల్స్,డెస్క్

"జై కార్యకర్త... జై జై కార్యకర్త" అంటూ తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపుతూ, భవిష్యత్ రాజకీయాలకు, ప్రభుత్వ పాలనకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తూ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మహానాడు ముగింపు వేదికపై నుండి ఉద్విగ్న ప్రసంగం చేశారు. రెండు రోజుల పాటు డిజిటల్ వేదికగా అత్యంత వైభవంగా జరిగిన ఈ మహానాడులో కార్యకర్తే అధినేత అనే స్ఫూర్తిని

# ఎకరా 237 కోట్లు!

మొదటి పేజీ రువాయి

ఎకరా భూమి రూ.237 కోట్లు పలికి సరికొత్త రికార్డును సృష్టించింది. రాయదుర్గంలోని పాన్ మక్తాలోని సర్వే నెంబర్ 83/1లో 6 ఎకరాల 29 గుంటలకు వేలం వేశారు. ఈ క్రమంలో టీజీఐఐసీ భూముల వేలానికి అనూహ్య స్పందన లభించింది.ఈ వేలంలో భూమిని గౌర వెంచర్స్ దక్కించుకుంది. గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికిన విషయం తెలిసిందే. ఆరోజు 7 ఎకరాలకు రూ.1,357.59 కోట్లు వచ్చింది.టీజీఐఐసీ వేలం వేసే భూములు మంచి డిమాండ్ ఉంటోంది. సర్వే నెంబర్ 83/1లోని ప్లాట్ 1ఏ, 1ఎఫ్‌లోని 6.29 ఎకరాలు, ప్లాట్ నెంబర్ పీ4లోని 5.09 ఎకరాలు సహా మొత్తం 11.38 ఎకరాల భూమి వేలానికి నోటిఫికేషన్ వచ్చింది. ఎకరాకు రూ.139 కోట్ల ధరను నిర్ధారించారు. ఈ వేలం ద్వారా రూ.2 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని టీజీఐఐసీ అంచనా వేస్తోంది. ప్లాట్ నెంబర్ పీ4లోని భూములకు జూన్ 1న ఆన్ లైన్ లో వేలం నిర్వహించనున్నారు.

# సీఎం పదవికి రాజీనామా చేశాను...

మొదటి పేజీ రువాయి

చేశారు. గురువారం మధ్యాహ్నం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో కలిసి బెంగళూరులోని లోక్‌భవన్‌కు వెళ్లిన ఆయన, తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కార్యాలయంలో అందజేశారు. గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో, ఆయన ప్రత్యేక కార్యదర్శికి రాజీనామా పత్రాన్ని సమర్పించినట్లు సిద్ధరామయ్య స్వయంగా వెల్లడించారు. అనంతరం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే తాను రాజీనామా చేసినట్లు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సిద్ధరామయ్య కొంత భావోద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 2006లో కాంగ్రెస్ పార్టీలో చేరానని, అప్పటి నుంచి పార్టీ తనను ఎంతో ఆదరించిందని గుర్తుచేసుకున్నారు. మంత్రిగా, రెండుసార్లు సీఎంగా, ప్రతిపక్ష నేతగా తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని తెలిపారు. ఏడు కోట్ల కన్నడ ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టమన్నారు. తాను ముఖ్యమంత్రి అవుతానని కలలో కూడా అనుకోలేదని సిద్ధరామయ్య అన్నారు. తన కుటుంబంలో ఎవరికీ రాజకీయ నేపథ్యం లేదని, తాను గ్రామీణ జీవితం నుంచి వచ్చానని, పొరపాటున రాజకీయాల్లోకి అడుగుపెట్టానని వ్యాఖ్యానించారు.తన రాజకీయ జీవితంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ, ముఖ్యంగా తనకు సీఎం అయ్యే అవకాశం కల్పించిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించానని చెప్పారు. సామాజిక న్యాయం, సమానత్వాన్ని తాను బలంగా నమ్ముతానని, సమాజంలో అసమానతలు తొలగిపోయి అందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నదే తన ఆకాంక్ష అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. తన రాజీనామాను గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం తనకుందని ఆయన తెలిపారు.

# ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్

మొదటి పేజీ రువాయి

ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలని తెలిపారు.ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఎస్‌ఈఈఈపీసీ సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని చెప్పారు.కేరళం నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, తెలంగాణ ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సీఎం స్పష్టం చేశారు.ఈ కార్డులపై మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ కె. రామకృష్ణారావు సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు.

# ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే

మొదటి పేజీ రువాయి

గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో' యాత్ర చేపట్టారని ప్రస్తావించారు.అన్నివర్గాలు, అన్నిమతాల ప్రజలు సమానమేనని, అందరు కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో 'భారత్ జోడో' యాత్ర చేశారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అనడానికి ఇది ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. నల్గొండలో మతసామరస్యానికి, గంగా – జమునా – తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం కానుంది

మొదటి పేజీ రువాయి

: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను మంత్రులు పరిశీలించారు.

**అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి**

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందని తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతుందని పేర్కొన్నారు.

**నగర అభివృద్ధి పనులకు మరింత వేగం**

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని అన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. దేశంలోనే అత్యుత్తమ మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర అభివృద్ధి ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు.

# మద్యం కుంభకోణం కేసు

మొదటి పేజీ రువాయి

గతంలో సీజ్ చేసిన మొబైల్ ఫోన్‌లలోని వివరాలను ఈడీ అధికారులు సేకరించారని తెలిపారు. లోపల ప్రశ్నలు, విచారణలు పెద్దగా ఏమీ జరగలేదని పేర్కొన్నారు. తన ఫోన్‌లోని డేటా ట్రాన్స్ ఫర్ కోసం పిలిచినట్లు చెప్పారు. వారికి అవసరమైన సమాచారం తన ఫోన్‌లో ఉంటుందనే ఉద్దేశంతో ఆ డేటాను తీసుకున్నట్లు చెప్పారు.మద్యం పాలసీ కుంభకోణం ఎలా జరిగింది, ఏం జరిగిందనే విషయాలు తెలిసిన వ్యక్తి రాజ్ కెసిరెడ్డి మాత్రమే అన్నారు. ఇప్పటి వరకు తాను ఆయన ఒక్కరి పేరు తప్ప ఎవరి పేరునూ చెప్పలేదని అన్నారు. సిట్ అధికారులకైనా, ఈడీ అధికారులకైనా తాను ఇదే విషయం చెప్పానని అన్నారు. తనను ఎవరు లక్ష్యంగా చేసుకున్నా భయపడే వ్యక్తిని కాదని వ్యాఖ్యానించారు. తిరుమల వెంకన్న సాక్షిగా తాను ఎలాంటి తప్పు చేయలేదని విజయసాయిరెడ్డి అన్నారు.

# బీజేపీలో కీలక మార్పులు..

మొదటి పేజీ రువాయి

అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ కార్యదర్శి అరుణ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.తాజా మార్పుల ప్రకారం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాకు ఢిల్లీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. వీరేంద్ర సచ్‌దేవా స్థానంలో ఆయన ఈ పదవిని చేపట్టనున్నారు. హర్యానా బీజేపీ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ అర్చనా గుప్తాను, పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సర్దార్ కేవల్ సింగ్ ధిల్లాన్‌ను, త్రిపుర సారథిగా డాక్టర్ అభిషేక్ దేబ్రాయ్‌ను నియమించారు.నితిన్ నబిన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీలో జరిగిన తొలి పెద్ద పునర్వ్యవస్థీకరణ ఇదే కావడం గమనార్హం. ఈ నియామకాల్లో పంజాబ్ అధ్యక్షుడి ఎంపికకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మార్పు కీలకంగా మారింది. ప్రస్తుతం ఆప్ పాలనలో ఉన్న పంజాబ్‌లో కాంగ్రెస్ నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ రాజకీయ అవకాశాన్ని అందిపుచ్చుకుని కీలక శక్తిగా ఎదగాలని బీజేపీ భావిస్తోంది.ఈ కొత్త అధ్యక్షులు త్వరలోనే పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఇతర కేంద్ర నాయకులతో సమావేశం కానున్నారు. వీరి నేతృత్వంలో రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో కొత్త కార్యవర్గాల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది.

# ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్

మొదటి పేజీ రువాయి

ఆవిష్కరించారు. గతంలో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా.. మైత్రీవనం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. నగరంలోని ఎన్టీఆర్ అభిమానుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ, ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి ఈ విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి మరీ ఆవిష్కరించారు.ఈ విగ్రహ ఏర్పాటు ప్రక్రియ విజయవంతం కావడంలో స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ విగ్రహ స్థాపన పనులను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. నగర నడిబొడ్డున ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించడం పట్ల నందమూరి అభిమానులు, తెలుగు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, భారీ సంఖ్యలో ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



# ఒక్కో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు.. ఇందిరమ్మ ఇండ్లకు సమానం

మొదటి పేజీ రువాయి

నిర్వహించారు.

**పొంగులేటి ఎమన్నారంటే..? :**

ఈ సమీక్ష అనంతరం గత ప్రభుత్వ చర్యలపై విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు పొంగులేటి సవాల్ విసిరారు. హైదరాబాద్ నగరంలో గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో నిర్మాణం చేపట్టిన ఇళ్లకంటే రానున్న రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికంగా ఇళ్లు నిర్మాణం చేయకపోతే తాను వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీచేయనని.. అదే కాంగ్రెస్ సర్కార్ ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే కేటీఆర్ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండేందుకు సిద్ధమా..? అంటూ పొంగులేటి సవాల్ చేశారు. తాజాగా ఈ సవాల్‌పై కేటీఆర్ ఘాటుగా స్పందించారు.

**సవాల్ చేయడం.. పారిపోవడం :**

తాము గృహనిర్మాణ యజ్ఞం చేసిన నిర్మాతలం అయితే.. కాంగ్రెస్ నేతలు గృహ మేధ యాగం చేస్తున్న విధ్వంసకులు అంటూ కేటీఆర్ విమర్శలు చేశారు. ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ తమదే అన్న కేటీఆర్.. సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటని వ్యాఖ్యానించారు. తాము తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని.. పేదల సొంతింటి కలను సాకారం చేశామని తెలిపారు.

**డబ్బా ఇండ్లు కాదు.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు :**

తమ హయాంలో డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని కేటీఆర్ అన్నారు. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని సవాల్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకొనే దమ్ముందా అంటూ ప్రశ్నించారు. శపథం చేయడం కాదని.. చేతనైతే చేసి చూపించాలని సవాల్ చేశారు. పౌరుషం ఉంటే 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. గుమ్మం తొక్కి ఓట్లు అడుగుతామన్న సవాల్‌కు మంత్రి పొంగులేటి కట్టుబడి ఉండాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**తమవి దేశానికే నమూనా ఇళ్లు :**

హైదరాబాద్ మహానగరంలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించిన ఘనత తమదని కేటీఆర్ అన్నారు. రూ.70 వేలతో అగ్గిపెట్టెలాంటి ఇళ్లు కట్టలేదన్న కేటీఆర్ తమ హయాంలో నిర్మించిన ఒక్కో ఇళ్లు ఏడు ఇందిరమ్మ ఇళ్లతో సమానమంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో దేశానికే నమూనాగా అందమైన పొదరిల్లను నిర్మించి చూపించామన్నారు.

**కట్టిన ఇళ్లు ఎన్ని.. కూల్చిన ఇళ్లు ఎన్ని :**

ఇటుకలు పేర్చి ఇళ్లు కట్టింది తామైతే.. పేదల గృహాలపైకి బుల్డోజర్లు ఎక్కించి కూలగొడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. గత రెండు సంవత్సరాల్లో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని.. కూల్చిన ఇళ్లు ఎన్ని.. అని ప్రశ్నించిన కేటీఆర్ ఆ వివరాలతో శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఉందా అంటూ ప్రశ్నించారు. దీపావళి బాంబులు పేలుస్తామంటూ.. తుస్సుమనిపించిన "మినిస్టర్ బాంబులేటి" అంటూ ఘాటుగా విమర్శించారు. దిల్లీకి లొంగిపోయి కేసుల నుంచి తప్పించుకోవడం తమకు తెలియదని, అడ్డదారుల్లో వేలకోట్ల కాంట్రాక్టులు ఇప్పించుకునే అవినీతి కిటుకూ తమకు తెలియదంటూ తీవ్ర విమర్శలు చేశారు.

**కాంగ్రెస్ నేతలను వదిలిపెట్టం :**

కాంగ్రెస్ నేతలు ఎన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా.. వారిని వదిలిపెట్టబోమని కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్ల ఎగవేత ద్రోహాన్ని ప్రశ్నిస్తునే ఉంటామన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# తడిసిన ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లిస్తాం

మొదటి పేజీ రువాయి

ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు వేగం పెంచాలని ఈ సమీక్ష చేస్తున్నాట్లు తెలిపారు. గన్నీ బ్యాగుల కొరత లేదని చెప్పారు. జూన్ 4, 5వ తేదీల్లో రాష్ట్రంలోని రుతుపవనాలు ప్రవేశించనున్నాయని వివరించారు. ధాన్యం తరలింపునకు అన్ని మార్గాలు ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఇసుక లారీలను సైతం ధాన్యం సరఫరాకు వాడుకోవాలకి తెలిపారు.4వ తేదీ లోపు ధాన్యం, మక్కల కాంటాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ధాన్యం తరలింపుతోపాటు నగదు చెల్లింపు వెంటనే పూర్తి చేయాలని వారికి స్పష్టం చేశారు. ధాన్యం స్టోరేజ్ కోసం ఇతర జిల్లాల గోడౌన్‌లను సైతం ఉపయోగించుకోవాలని కోరారు. తాలు, తరుగు విషయంలో నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు.

**తమాషాలు చేయకుండా పనిచేయండి: పొంగులేటి వార్నింగ్**

ధాన్యం కొనుగోలులో తాలు, తరుగు పేరుతో రైతులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఈ ఐదు రోజులు చాలెంజింగ్ పీరియడ్ అని అధికారులకు స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని కోరారు. తమాషాలు చేయకుండా పనిచేయాలని అధికారులకు మంత్రి వార్నింగ్ ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్ల అంశం మాత్రం సీరియస్‌గా తీసుకోవాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు.

# లోకేష్ ప్రతిపాదనను ఆమోదిస్తున్నాం

మొదటి పేజీ రువాయి

ప్రతిబింబిస్తూ, 2029 ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లోకేష్ ప్రతిపాదనను ఆమోదిస్తూ పార్టీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చంద్రబాబు చారిత్రక ప్రకటన చేశారు. బీసీలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తామని ఉద్ఘాటించారు. ఈ వర్చువల్ మహానాడుకు రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ల నుండి, 12 దేశాల నుండి ఏకంగా 24.5 లక్షల మంది హాజరుకావడం ఒక చరిత్ర అని, రికార్డులు సృష్టించడం, వాటిని తిరగరాయడం టీడీపీకే సాధ్యమని చంద్రబాబు అన్నారు.

కార్యకర్తే పార్టీకి బలం, భవిష్యత్తు

ప్రసంగం ఆద్యంతం చంద్రబాబు కార్యకర్తల త్యాగాలను, సేవలను స్మరించుకున్నారు. "శాశ్వతంగా పార్టీని మోసింది, మోసేది, మోయబోయేది కార్యకర్తలే. వారందరికీ నా పాదాభివందనం. నాపై కార్యకర్తలు, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తాను" అని ఆయన భావోద్వేగంతో ప్రసంగించారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేశామని, వారి పిల్లల విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపారు. "ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ మా లక్ష్యం. నీతి నిజాయితీగా కార్యకర్తలు ఆర్థికంగా ఎదిగేలా నేను బాధ్యత తీసుకుంటాను" అని భరోసా ఇచ్చారు. మెడపై కత్తి పెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలిన కార్యకర్తలే తనకు శిరోధార్యమని చెబుతూ, వారి త్యాగాలను గుర్తుచేసుకున్నారు.

గొడ్డలి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు

ప్రతిపక్షంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "గొడ్డలి పార్టీకి అధికారం పోయింది, ప్రతిపక్ష హోదా పోయింది, అయినా అహంకారం మాత్రం పోలేదు. కుట్రలు, కుతంత్రాలు మానడం లేదు" అని దుయ్యబట్టారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకైనా యువత, రైతులు, మహిళలు వంటి విభాగాలుంటే, గొడ్డలి పార్టీకి మాత్రం గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్, సోషల్ మీడియా సైకోల బ్యాచ్, ఫేక్ ప్రచారాల పేటీఎం బ్యాచ్, హత్యా రాజకీయాల కిరాయి హంతక బ్యాచ్, దేవాలయాలపై దాడి చేసే బ్యాచ్, కల్తీ లిక్కర్ బ్యాచ్ వంటి ఏడు విధ్వంసక విభాగాలున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని, అదే సమయంలో నాయకులు, కార్యకర్తలు తమ వ్యక్తిత్వానికి మరక అంటకుండా జాగ్రత్తపడాలని హితవు పలికారు. "డబ్బు పోతే సంపాదించుకోగలం, క్యారెక్టర్ పోతే కోలుకోలేం" అని ఆయన నొక్కి చెప్పారు. "గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, ఎన్డీఏ అగైన్ అండ్ అగైన్" అనేదే మన నినాదం కావాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## రాజపేట మండలంలో

# దాన్యం కొనుగోళ్లలో పుంజుకున్న వేగం

**తహసిల్దార్ వల్లపు ప్రదీప్ కృషితో ఏర్పాట్లు**
**రోజుకు 20 లారీల ధాన్యం కొనుగోలుకు చర్యలు**
**10 రోజుల్లో పూర్తి ధాన్యం కొనుగోలు దిశగా పరుగులు**
**"రామాజీపేట గోదాం"ప్రత్యేక లారీలు, అదనంగా మరో 40 మంది హమాలీల ఏర్పాటు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలో రైతుల నుండి ధాన్యం కొనుగోలులో వేగం పుంజుకొని పది రోజుల్లో పూర్తిచేసేలా తహసిల్దార్ వల్లపు ప్రదీప్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. లారీలు, హమాలి, గోదాం లాంటి ప్రధాన సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారం చేసుకొని గురువారం నుండి నిత్యం 15 నుండి 20 లారీలు ధాన్యం కొనుగోలు అయ్యేలా అన్ని చర్యలు చేపట్టారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సూచనలు ప్రత్యేక చొరవతో రేణికుంట పిఎసిఎస్ సీఈవో సిల్వేరు శేఖర్ గౌడ్, ఎస్ఐ లింగారెడ్డి సహకారంతో తహసిల్దార్ సమస్యలను అధిగమించారు. "రామాజీపేట గోదాం" ప్రత్యేక లారీలు, అదనంగా మరో 40 మంది హమాలీల ఏర్పాటును చేసుకున్నారు. దీంతో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వడ్ల కొనుగోలు ప్రక్రియ వేగం పుంజుకుంది. పది రోజుల్లో అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసి గోదాముకు పంపేందుకు తాసిల్దార్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకున్నారు. సెలవు రోజులలో కూడా తాసిల్దార్ విధులు నిర్వర్తిస్తూ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయం రవాణా చర్యలను కొనసాగిస్తున్నారు. దీంతో నిత్యం పదివేలకు పైగా ధాన్యం బస్తాలు గోదాముకు తరలించేందుకు కార్యాచరణ రూపొందించుకోవడంలో తహసిల్దార్ వల్లపు ప్రదీప్ సక్సెస్ అయ్యారు. గతంలో కంటే రెట్టింపుకు పైగా సుమారు 6 లక్షల బస్తాల ధాన్యం సేకరణ చేసేందుకు తాసిల్దార్ అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రతి నిత్యం గంట గంటకు అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న సేకరణ రవాణాపై తాసిల్దార్ తెలుసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయిస్తున్న రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజపేట మండలాన్ని జిల్లా అధికారులు ఇప్పటి వరకు సందర్శించక పోవడాన్ని పరిశీలిస్తే తహసిల్దార్ వల్లపు ప్రదీప్ పై ఉన్న నమ్మకం అర్థమవుతు



# బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొట్టే వెంకమ్మ కుటుంబానికి బియ్యం పంపిణీ....

**తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేసినట్లు తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన గొట్టే వెంకమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా మృతురాలి దశ దిన కర్మ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్మెన్ శ్రీమతి బీర్ల అనిత ఐలయ్య సహకారంతో 50 కిలోల బియ్యన్నీ కుటుంబ సభ్యులకు అందజేసి మనో ధైర్యాన్ని కల్పించినట్లు ఆయన చెప్పారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్ఫూర్తితో ఆలేరు నియోజక వర్గంలో ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని బీర్ల ఫౌండేషన్ చైర్మెన్ శ్రీమతి బీర్ల అనిత ఐలయ్య చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలు గొప్ప వని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, స్థానిక సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు దేవరుప్పల మల్లేష్, వార్డు సభ్యుడు ధ్యాన బోయిన నవీన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, దేవరుప్పల బాలయ్య,ధ్యాన బోయిన బొందయ్య, గొప్ప కొండల్ రెడ్డి, ధ్యాన బోయిన కరుణాకర్, గుంటి ఆంజనేయులు, ధ్యాన బోయిన నర్సింహులు, కొడారి రామస్వామి, కొడారి శ్రీను, గుంటి బాల్ నర్సయ్య, ధ్యాన బోయిన సత్తయ్య, పోతరాజు సత్యనారాయణ, ఆవుల సత్తయ్య తదితరులు ఉన్నారు



# కొమరవెల్లి వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతుల ఆవేదన

**తాలు పేరుతో రైతులను దోచుకోవడం ఆపాలి**
**బిజెపి ఆత్మనిర్బర్ భారత్ జిల్లా కన్వీనర్ కేసరి ఆంజనేయులు గౌడ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని కొమరవెల్లి గ్రామపంచాయతీ వద్ద కొనుగోలు కేంద్రంలో రైతులు పండించిన వరి వడ్లను భారతీయ జనతా పార్టీ నాయకులు సందర్శించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ కేసరి ఆంజనేయులు గౌడ్, జిల్లా కార్యదర్శి చేపూరి నవీన్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మైలారపు సుగుణాకర్, మండల ప్రధాన కార్యదర్శి సునర్కర్ తిరుపతి సందర్శించి రైతులు. ఈ సందర్భంగా రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తు అకాల వర్షాలతో వరి వడ్లు తడిసి భారీ నష్టాలు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గిట్టుబాటు ధర లేక రైతు కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని వాపోయారు. ఈ సందర్భంగా బీజేపీ ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ కేసరి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ..జిల్లాలోని వడ్ల కొనుగోలు కేంద్రాల్లో తాలు పేరుతో రైతులను మోసం చేస్తూ రెండు నుంచి నాలుగు కిలోల వరకు వడ్ల తూకంలో తగ్గించి రైతుల రక్తాన్ని పీలుస్తున్నారు అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతు చెమటను దోచుకునే ఈ దందాను ప్రభుత్వం వెంటనే అరికట్టాలి అని అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లారీలు, గోని సంచుల సరైన ఏర్పాట్లు లేక వడ్లను తరలించకుండా రైతులు రోజుల తరబడి కల్లాల వద్దనే పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు.ఆరుగాలం కష్టపడి పండించిన రైతు పంటను కాపాడటం ప్రభుత్వ కనీస బాధ్యత అని అన్నారు.రైతులు తెచ్చిన ప్రతి గింజను వెంటనే కొనుగోలు చేయాలని,వర్షాలకు తడిసిన ధాన్యాన్ని నాణ్యత పేరుతో తిరస్కరించవద్దని, రైతులకు తక్షణ పరిహారం ప్రకటించాలని,రైతు భరోసా పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రతి అర్హ రైతుకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అదేవిధంగా ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూ భారతి వ్యవస్థలో భూమి హక్కుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు తమ భూమి సమస్యల పరిష్కారం కోసం ఎమ్మార్వో కార్యాలయాలు, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే భూ సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉధృతమైన ఆందోళనలు తప్పవు!" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చేపూరి నవీన్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మైలారపు సుగుణాకర్, మండల ప్రధాన కార్యదర్శి సునర్కర్ తిరుపతి, వార్డు సభ్యులు ముంజం అఖిల్ తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. అని పేర్కొన్నారు. రైతు చెమటకు గౌరవం ఇవ్వాలి. రైతు హక్కుల కోసం బీజేపీ పోరాటం ఆగదు అని వెల్లడించారు.



# 5 లక్షల మంది రష్యా సైనికులు మృతి.. కారణం అదే !!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28 :**
రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం ప్రపంచ రాజకీయాలను కుదిపేస్తూనే ఉంది. 2022లో ప్రారంభమైన ఈ ఘర్షణ నాలుగో ఏడాదిలోకి అడుగుపెట్టినా, యుద్ధానికి ముగింపు కనిపించడం లేదు. వేల కోట్ల డాలర్ల నష్టం, లక్షలాది మంది ప్రాణనష్టం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిన ఈ యుద్ధం ఇప్పుడు మరింత ప్రమాదకర దశకు చేరుకుంటోందని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికే రష్యా ఈ యుద్ధంలో భారీ మూల్యం చెల్లించినట్లు బ్రిటన్ నిఘా సంస్థలు వెల్లడించాయి. తాజా అంచనాల ప్రకారం, ఇప్పటివరకు ఐదు లక్షల మందికి పైగా రష్యా సైనికులు మరణించినట్లు లేదా తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ఈ సంఖ్య రెండో ప్రపంచ యుద్ధం తర్వాత రష్యా ఎదుర్కొన్న అతిపెద్ద సైనిక నష్టాల్లో ఒకటిగా భావిస్తున్నారు.బ్రిటన్ రక్షణ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రష్యా నిరంతరం దాడులు కొనసాగిస్తున్నప్పటికీ, ఉక్రెయిన్ సైన్యం గట్టి ప్రతిఘటన ఇస్తోంది. ముఖ్యంగా డ్రోన్లు, క్షిపణులు, పాశ్చాత్య దేశాల నుంచి అందుతున్న ఆధునిక ఆయుధాలతో ఉక్రెయిన్ ఎదురుదాడులు మాస్కోకు భారీ నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మరోవైపు రష్యా కూడా యుద్ధాన్ని మరింత ఉధృతం చేస్తోంది. ఉక్రెయిన్‌లోని కీలక నగరాలు, విద్యుత్ కేంద్రాలు, ఆయుధ నిల్వలపై భారీ మిసైల్ దాడులు కొనసాగిస్తోంది. ఇటీవల రష్యా ప్రయోగించిన హైపర్‌సోనిక్ క్షిపణులు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగించాయి. దీంతో నాటో దేశాలు కూడా అప్రమత్తమయ్యాయి. ఈ యుద్ధం వల్ల సాధారణ ప్రజల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. లక్షలాది మంది ఉక్రెయిన్ పౌరులు తమ ఇళ్లను వదిలి ఇతర దేశాలకు వలస వెళ్లాల్సి వచ్చింది. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం, కోట్లాది మంది ఇప్పటికీ శరణార్థ శిబిరాల్లోనే జీవిస్తున్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అలానే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఈ యుద్ధం తీవ్ర ప్రభావం చూపింది. చమురు, గ్యాస్ ధరలు పెరగడం, ఆహార ధాన్యాల సరఫరాలో అంతరాయం, ఆయుధ వ్యయం పెరగడం వల్ల అనేక దేశాలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా యూరప్ దేశాలు ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతు కొనసాగిస్తుండగా, రష్యాపై కఠిన ఆర్థిక ఆంక్షలు అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ, మాస్కో వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ యుద్ధాన్ని కొనసాగించాలనే ధృఢసంకల్పంతో ఉన్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇక శాంతి చర్చలపై కూడా అనిశ్చితి నెలకొంది. గతంలో టర్కీ, చైనా వంటి దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నించినా, స్పష్టమైన ఫలితం రాలేదు. ఇరు దేశాలు తమ తమ డిమాండ్లపై కఠిన వైఖరి అవలంబిస్తుండటంతో యుద్ధ విరమణ దూర స్వప్నంగా మారింది.ప్రస్తుతం బయటపడుతున్న గణాంకాలు ప్రపంచాన్ని షాక్‌కు గురిచేస్తున్నాయి. లక్షలాది మంది సైనికులు, అమాయక ప్రజల ప్రాణాలు బలైన ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అన్న ప్రశ్నకు సమాధానం లేకుండాపోయింది. ప్రపంచ శాంతికి ఇది అతిపెద్ద ముప్పుగా మారిందని అంతర్జాతీయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



# జీవితాంతం మరిచిపోలేని దేవుడు ఎన్టీఆర్ : మాజీ మంత్రి మోత్కుపల్లి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మాజీ ముఖ్యమంత్రి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) రాజకీయ బిక్ష పెట్టిన దేవుడని ఆయనను జీవితాంతం మరిచిపోనని మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. గురువారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా హైదరాబాదులోని ఎన్టీఆర్ సమాధి వద్ద ఆయన పూలమాలవేసి నివాళులు అర్పించిన సందర్భంగా మాట్లాడారు. ఎన్టీఆర్ రాష్ట్ర దేశ ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేస్తూ, రాజకీయంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను తెలుపుతూ ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ మోత్కూపల్లి నర్సింహులు కంటనీరు పెట్టుకున్నారు. గిరెడ్డి ముకుంద రెడ్డి తదితరులు తన వెంట ఉన్నారు.

# పవర్ లూమ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ లను నెరవేర్చాలి....

## సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో భవనారూషి చేనేత కార్మిక సంఘం కూలి రేట్లు పెంచాలని చేపట్టిన దీక్ష ఏడవ రోజుకు చేరుకున్న సందర్భంగా గురువారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ హాజరై సంఘీభావం తెలిపారు. దీక్షను ఉద్దేశించి మాట్లాడుతూ... రోజు పని చేస్తే గాని పూట గడవని చేనేత కార్మికులకు గత ఆరు సంవత్సరాలుగా కూలీ రేటు పెంచకపోవడం విడ్డూరమని ఈ ఆరు సంవత్సరాలలో వస్తు ధరలు రెండింతలు అయ్యాయని పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని తినే ఆహారం సంబంధించి వంట నూనె గ్యాస్ పప్పు దినుసులు పాల ధరలు విపరీతంగా పెరిగాయని న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇరుపక్షాలు నడుచుకోవాలని తెలిపారు. త్వరలోనే ఇరుపక్షాలను చర్చలకు ఆహ్వానించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తుంగ అక్షయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కలకుంట్ల పోచయ్య, కటకం నాగభూషణం, కలకుంట్ల కొమరయ్య, మిర్యాల ప్రశాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లీంలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన బషీర్ ఖురేషి



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28:**
కృష్ణారెడ్డి పేట్ వార్డు కార్యాలయం పరిధిలోని ముస్లిం సోదరులకు బషీర్ ఖురైషి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.త్యాగం, ప్రేమ, భక్తికి ప్రతీక బక్రీద్ అని,అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు.భక్తి శ్రద్దలతో జరిపే అందరి ప్రార్థనలు ఫలించాలని తెలిపారు. తెలంగాణాలో కుల, మతాల ఐక్యతను పెంచిన ఘనత కేసీఆర్ దేనని,ఆయన హయాంలోనే పండుగలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయని పేర్కొన్నారు. గంగా,జమున తహజీబ్‌లా తెలంగాణాలో అన్ని మతాలు కలిసిమెలసి జీవిస్తున్నామని అన్నారు.గత పదమూడేండ్లుగా పండుగలన్నీ ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటున్నామని,ఇదే సంస్కృతిని ముందు తరాలకు అందేలా కొనసాగించుకుం దామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ శాంతి సమరస్య వాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని, ప్రతి కుటుంబంలో ముస్లిం సోదరులు ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నిండాలని కృష్ణారెడ్డిపేట వార్డు కార్యాలయం ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని అల్లాహ్ ను ప్రార్థిస్తున్నట్లు బషీర్ ఖురేషి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు బడి మస్జిద్ సదర్ మొహమ్మద్ అలీ, మాజీ ఉపసర్పంచ్ మొహమ్మద్ ఫహీం,ఖమర్ ఖురేషి, మోయిన్, సలీం, అంజద్ అలీ, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన చేనేత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మోత్కూరు సహకార సంఘంలో అర్హులైన వారికి సభ్యత్వం కల్పించాలని, అర్హులైన చేనేత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క పద్మశాలి చేనేత కార్మికులకు పెన్షన్ల కొరకు సరైన గుర్తింపు కార్డులు ఇవ్వవలసిందిగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి మోత్కూరు పద్మశాలి సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించడం జరిగింది. దీనిపై వెంటనే స్పందించిన విప్ బీర్ల ఐలయ్య హ్యాండ్లూమ్ ఏడి కి ఫోన్ చేసి మాట్లాడి సమస్యను పరిష్కరించవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి అధ్యక్షులు యెలాగందుల మహేష్, మాజీ మండల అధ్యక్షులు నోముల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాద్రి పృథ్వీరాజ్



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28 :** త్యాగానికి, భక్తికి, సోదరభావానికి ప్రతీకగా జరుపుకునే పవిత్రమైన బక్రీద్ (ఈద్–ఉల్–అజ్హా) పండుగ సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని మురాద్ అలీ షా దర్గా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించి, వారికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందాలని ఆకాంక్షించారు. బక్రీద్ పండుగ అనేది త్యాగం, మానవత్వం, దైవభక్తికి నిదర్శనం అని పేర్కొన్న పృథ్వీరాజ్... అన్ని మతాలు శాంతి, ప్రేమ, సోదరభావాన్నే బోధిస్తాయని తెలిపారు. ప్రజలంతా కలిసిమెలిసి సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గూడెం మధుసూదన్ రెడ్డి, బాయికాడి విజయ్, శ్రీధర్ చారి, ధనరాజ్ గౌడ్, గుండమోల్ల రాజు, వీరారెడ్డి, ముస్లిం సోదరులు మరియు వివిధ నాయకులు పాల్గొన్నారు

# ఘనంగా శ్రీ లక్ష్మీ సుదర్శన మహాయాగం

## యాగంలో పాల్గొన్న ఖేడ్ ఎమ్మెల్యే దంపతులు

పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, అనుపమ దంపతులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని శ్రీ మహతి జ్యోతిష్యాలయం నందు లోకకల్యాణార్థం శ్రీ లక్ష్మీ సుదర్శన మహాయాగ క్రతువు అత్యంత వైభవంగా కొనసాగుతోంది. పురోహితులు, స్మార్త జ్యోతిష్య చండీ ఉపాసకులు శ్రీ మాల్మంచి గురురాజ శర్మ ఆధ్వర్యంలో అధికజ్యేష్ట మాసం సందర్భంగా ఈ మహా యాగమును నిర్వహిస్తున్నారు. ఈ నెల (మే) 18వ తేదీన ప్రారంభమైన ఈ యాగ క్రతువు జూన్ 15వ తేదీ అమావాస్య పార్యము వరకు నెల రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగనుంది. ఈ మహా యజ్ఞంలో భాగంగా గురువారం నాడు జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో లినారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, అనుపమ సంజీవరెడ్డి దంపతులులి ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాగ నిర్వాహకులు మాల్మంచి గురురాజ శర్మ ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాగ విశేషాలను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ బిజెపి ధర్నా



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లాలో మంత్రుల పర్యటన దృష్టిలో పెట్టుకొని బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్ ను గురువారం రాజపేటలో ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మండల శాఖ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దాచేపల్లి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ... రైతుల వద్ద కొనుగోలు వేగవంతం చేయాలని, 15వ, ప్యాకేజి ద్వారా రాజపేట మండలంలోని అన్ని గొలుసు కట్టు చెరువులు నింపాలని లేనిచో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలు చేపట్టి ఎక్కడికి అక్కడ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సాధనబోయిన శంకర్, జిల్లా నాయకులు కాసోజు సంపత్, బూర్గు శేకర్ రెడ్డి, కుమ్మరి లక్ష్మణ్, రేగొండ మాధవులు, అంకతి భాస్కర్, సోమసాని చెంద్రమోహన్, ఎక్కలదేవి శ్రీహరి, సంగెమ్ వేణు, విష్ణు, పంది రాజు, నాగపురి ప్రవీణ్, ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# తోటి స్నేహితుల సాయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన ఇంజ ఇస్తారి మృతి చెందగా ఆయన చిన్న కుమారుడు వంశీ బాల్య స్నేహితులు గురువారం పరామర్శించి సాయం చేశారు. 2014 – 15 ఎస్ఎస్సి బ్యాచ్ స్నేహితులు ఎనిమిది వేల రూపాయలు, 50 కిలోల బియ్యాన్ని అందజేసి తమ స్నేహితుడు వంశీ తోపాటు కుటుంబానికి మనోధైర్యాన్ని అందించారు.

# మామిడిగల్ల కృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన మామిడిగల్ల కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబానికి గురువారం రోజున మన పాముకుంట ఫౌండేషన్ సభ్యులందరి సహకారంతో 2000 రూపాయలు వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మన పాముకుంట ఫౌండేషన్ సబ్యులు పాల్గొన్నారు

# తక్షణమే వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలి

## బిఆర్ఎస్ నాయకులు కర్రే వెంకటయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట మండలం మల్లాపురం ఐకెపి సెంటర్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయిన రైతలకు అండగా నిలుస్తామని భరోసా ఇస్తూ బిఆర్ఎస్ నాయకులు కర్రే వెంకటయ్య అధికారులకు ఫోన్ చేసి లారీలను మల్లపురానికి పంపించాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు ఐకెపి కల్లాలలో ఉన్న వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు రైతులు పండించిన ధాన్యాన్ని నెలల తరబడి కొనుగోలు చేయకపోవడంతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని రైతులు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఐకెపి కల్లాలలో ఉన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ప్రతి గింజ కొనుగోలు చేసే వరకు రైతుల పక్షాన బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కారింగుల కిష్టయ్య, ఒగ్గు బిక్షపతి, కర్రె చంద్రశేఖర్, ఇండ్ల ప్రసాద్, ఒగ్గు మల్లేష్, మోటే శేఖర్, పుచ్చుల నర్సింహులు, గోపి, విజయ్, కర్రె శ్రీశైలం, గౌడ కరుణాకర్, కర్రె సత్యనారాయణ, భూషోల స్వామి, కర్రె శ్రీకాంత్, పుచ్చుల రాంబాబు, మధు చింటూ తదితరులు పాల్గొన్నారు.

# రిలే నిరాహార దీక్షలకు విశ్రాంతి ఉద్యోగుల సంఘీభావం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ఎస్పీఎంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు విశ్రాంతి ఉద్యోగుల సంఘం సంఘీభావం తెలిపింది. 9వ రోజు దీక్షలో పాల్గొన్న కార్మికులను నాయకులు పూలహారాలతో సత్కరించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని, నాన్ లోకల్ కార్మికులను తొలగించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు జీవో అమలు చేయాలని, విధుల్లోకి తీసుకోని కార్మికులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్మికుల పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుందని విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు

# తెలంగాణ చరిత్ర డిక్షనరీలో లేదు.. అమరవీరుల రక్తంలో ఉంది!

**చంద్రబాబు మెప్పు కోసం సొంత రాష్ట్రాన్ని గౌరవాన్ని తాకట్టు పెడతారా?**

**తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే సహించేది లేదు**

**బక్కని నరసింహులు వ్యాఖ్యలపై బిఆర్ఎస్ పార్టీ కొత్తూరు మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బిచ్య నాయక్ ధ్వజం..!**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, షాద్నగర్ :** ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా ఆ పార్టీ పొలిటికల్ బ్యూరో సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు బక్కని నరసింహులు తెలంగాణ రాష్ట్రాన్ని, ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. “డిక్షనరీలోనే తెలంగాణ అనే పదం లేదు” అంటూ ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను గిరిజన నాయకులు బిచ్య నాయక్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ బక్కని నరసింహులు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**తెలంగన రాష్ట్రం లో పుట్టి**

ఇక్కడి ప్రజల ఓట్లతో శాసనసభ్యుడిగా (ఎమ్మెల్యే) ఉన్నత బాధ్యతలు నిర్వహించిన ఒక సీనియర్ నాయకుడు, పొరుగు రాష్ట్ర వేదికపై నిలబడి తన సొంత ప్రాంతాన్ని ఇంతగా తక్కువ చేసి మాట్లాడటం అత్యంత బాధాకరమని బిచ్య నాయక్ పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం, పరాయి రాష్ట్ర నేతలను ప్రసన్నం చేసుకోవడం కోసం కన్నతల్లి లాంటి సొంత రాష్ట్రాన్ని కించపరచడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి, నీచమైన హేయమైన చర్యకు నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఎవరి భిక్షా కాదని, అది కొన్ని దశాబ్దాల సుదీర్ఘ పోరాటాల ఫలితమని గిరిజన నాయకుడు బిచ్య నాయక్ గుర్తు చేశారు. వందలాది మంది విద్యార్థులు, యువకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి, ఎందరో అమాయకులు ఆత్మబలిదానాలు చేసుకుంటే సాధించుకున్న గడ్డ ఇది ఎన్నో ఏళ్ల ఉద్యమం నుండి మలిదశ సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ లాంటి చారిత్రాత్మక పోరాటాలతో దేశ చిత్రపటంలో తన స్థానాన్ని సగర్వంగా చాటుకున్న చైతన్యాల గడ్డ తెలంగాణ అని గుర్తుచేశారు.. ఇలాంటి ఉజ్వలమైన, వీరోచితమైన చరిత్ర కలిగిన తెలంగాణ ఉనికినే ప్రశ్నించేలా మాట్లాడటం, కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలను మరియు అమరవీరుల త్యాగాలను తీవ్రంగా అవమానించడమే అవుతుందని మండిపడ్డారు. డిక్షనరీలో పదం లేదన్న వారికి, చరిత్ర పుటల్లో తెలంగాణ ప్రజా బాహుళ్యం రాసిన రక్తాక్షరాల పోరాటం కనిపించకపోవడం విచారకరమని చురకలు అంటించారు.

**బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**

తెలంగాణ అస్తిత్వాన్ని, ప్రజల ఆత్మగౌరవాన్ని గాయపరిచిన బక్కని నరసింహులు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయం ఏదైనా కావచ్చు కానీ, సొంత గడ్డను, ప్రజల అస్తిత్వాన్ని తాకట్టు పెట్టేలా మాట్లాడటం ఏమాత్రం తగదన్నారు. తెలంగాణ ప్రజానీకానికి ఆయన బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తెలంగాణ సమాజం మరియు ఉద్యమకారులు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# పశువుల దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

### గోదావరి నది ఒడ్డున దేహశుద్ధి ఇద్దరు యువకులకి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28,భద్రాద్రి కొత్తగూడెం :**
చర్ల మండలం పెద్దిపల్లి గోదావరి నదిలో అక్రమంగా పశువులను తరలిస్తున్న ఇద్దరు యువకులను లింగాల, గొమ్ముగూడెం గ్రామస్తులు అనుమానంతో అడ్డుకునే సరికి అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తిమ్మిరి గూడెం గ్రామానికి చెందిన 13 పశువులను గుంపెన గూడెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పశువుల దొంగతనానికి ఇద్దరు యువకులను దినసరి కూలీలుగా పెట్టుకున్నట్లు యువకులు తెలిపారు. దొంగతనంగా పశువులను మణుగూరుకు తరలిస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు ఇస్తానని చెప్పడంతో ఈ పనికి ఒప్పుకున్నట్లు ఇద్దరు యువకులు తెలిపారు. వెంటనే ఆగ్రహించిన పశు యజమానులు ఇద్దరికీ దేహ శుద్ధి చేసి పశువుల దొంగల విషయం చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.పశువుల దొంగతనానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, గతంలో చోరీకి గురైన పశువుల విషయం ఆరా తీయాలని పశువుల యజమానులు కోరుతున్నారు

# సాలెగూడలో వివాహ వేడుకకు కాంగ్రెస్ నేతల హాజరు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తీర్యాని మండలం సాలెగూడ గ్రామంలో గురువారం అనసూర్య - కృష్ణ రావుల వివాహం జరిగింది. ఈ వేడుకకు ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, డీసీసీ సుగుణక్క ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలు బహూకరించారు. కొత్త జంట సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాం చందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధ విజయ్, కార్యదర్శి కుర్సెంగ శోభన్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# రౌట సంకేపల్లిలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లు సిద్ధం

### సుగుణక్క అండ్ శ్యాం నాయక్ పరిశీలనలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ మండలం రౌట సంకేపల్లి గ్రామంలో మే 29న "జల్ జంగల్ జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం 2026" నిర్వహించనున్నారు. ఆదివాసుల సంప్రదాయాలు, సంస్కృతి, హక్కులు, అభివృద్ధికి అంకితమైన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ హాజరుకానున్నారు.కార్యక్రమ ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గ ఇంచార్జి శ్యాం నాయక్ స్వయంగా పరిశీలించారు. ఆదివాసుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రతీకగా ఈ గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.కార్యక్రమంలో క్రికెటర్ నాగేంద్ర, డీసీసీ ఉపాధ్యక్షులు భీంరావు, దీపక్ ముండే, సర్పంచ్ ఆత్రం కొందు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించిన మంత్రుల బృందం

### సివిల్ సప్లై అధికారులతో ధాన్యం కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రుల బృందం









**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట, భువనగిరి ప్రాంతాల్లో పర్యటించిన మంత్రుల బృందం తెలంగాణ రాష్ట్ర మంత్రులు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటి ఒ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ ఒ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి యాదగిరిగుట్టలోని గోశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంత్రులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రుల బృందం వంగపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తేమ శాతం, బస్తాల తరలింపు, చెల్లింపుల విధానం వంటి అంశాలపై ఆరా తీశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని, ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని అధికారులకు సూచించారు. తదుపరి రమాజీపేట సమీపంలో ఏర్పాటు చేసిన గోదామును పరిశీలించారు. ఈ గోదామును ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేయగా, మంత్రులు అక్కడ నిల్వ సామర్థ్యం, ధాన్యం భద్రత, నిర్వహణ విధానాలను పరిశీలించారు. గోదాములో ఎన్ని బస్తాలు నిల్వ చేయగలమనే వివరాలను అడిగి తెలుసుకొని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చర్యలను మంత్రులు ప్రశంసించారు. అనంతరం భువనగిరిలోని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సివిల్ సప్లై అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు పరిస్థితులు, నిల్వ సదుపాయాలు, రవాణా ఏర్పాట్లు, రైతులకు చెల్లింపుల ప్రక్రియపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లై అధికారులు, రైతులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'బాల భీముడి'కి జన్మనిచ్చిన భువనగిరి మహిళ! తల్లి, బిడ్డ క్షేమం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, తెలంగాణ బ్యూరో:** సంతాన లేమితో బాధపడుతూ, తల్లిదండ్రులు కాలేక అల్లాడిపోతున్న పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వ వైద్యం కొండంత అండగా నిలుస్తోంది. సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ గాంధీ ఆసుపత్రి ఐవీఎఫ్ సెంటర్ మరోసారి ఒక కుటుంబంలో వెలుగులు నింపింది. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన దంపతులకు తొలి ప్రయత్నంలోనే ఐవీఎఫ్ విజయవంతమై, ఏకంగా 4 కిలోల బరువున్న ఆరోగ్యకరమైన మగబిడ్డ జన్మించాడు. ఆ 'బాల భీముడిని' చూసి తల్లిదండ్రులు, వైద్యులు ఆనందంతో మురిసిపోతున్నారు.

**12 సార్లు వైఫల్యం.. గాంధీలో సఫలం!**
భువనగిరి జిల్లాకు చెందిన రవి, సౌమ్య దంపతులకు 9 సంవత్సరాల క్రితం వివాహమైంది. పెళ్లయిన ఇన్నేళ్లయినా సంతానం కలగకపోవడంతో వారు ఎన్నో ప్రైవేటు ఫర్టిలిటీ సెంటర్లను ఆశ్రయించినట్లు తెలిపారు. సుమారు 12 సార్లు వంటి ప్రొసీజర్లు చేయించుకున్నప్పటికీ ఫలితం దక్కలేదు. ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరిగి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి, తీవ్ర నిరాశకు గురైన ఈ దంపతులు గతేడాది గాంధీ హాస్పిటల్‌లోని ఐవీఎఫ్ సెంటర్‌ను ఆశ్రయించారు.

**కార్పొరేట్ వైద్యానికి దీటుగా.. ఉచితంగా!**
సౌమ్య, రవిల ఆరోగ్య సమస్యను నిశితంగా పరిశీలించిన గాంధీ వైద్యుల బృందం వారికి ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) ప్రక్రియను ప్రారంభించింది. మొదటి ప్రయత్నంలోనే ప్రెగ్నెన్సీ సక్సెస్ అయిందని గాంధీ ఐవీఎఫ్ నిపుణులు డాక్టర్ శోభ, డాక్టర్ ఫాతిమా వెల్లడించారు. ఐవీఎఫ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రసవం వరకు అవసరమైన యాంటినాటల్ చెకప్స్, స్కానింగ్‌లు, ఖరీదైన మందులను ప్రభుత్వం తరఫున పూర్తిగా ఉచితంగా అందజేశారు.

**తల్లి, బిడ్డ క్షేమం:**
ఈ నెల 27న సౌమ్య గాంధీ ఆసుపత్రిలోనే పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. సాధారణం కంటే ఎక్కువ బరువుతో (సుమారు 4 కిలోలు) పుట్టినప్పటికీ, ప్రస్తుతం తల్లి, బాబు ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని వైద్యులు స్పష్టం చేశారు. తొమ్మిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తమ చేతుల్లోకి




వచ్చిన బిడ్డను చూసుకుని రవి, సౌమ్య దంపతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తమకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి, తల్లిదండ్రులను చేసిన గాంధీ ఆస్పత్రి వైద్యులకు, ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ.. 'ఈ దంపతులు ప్రైవేటు హాస్పిటల్స్‌లో లక్షలు ఖర్చు చేసుకున్నారని, గాంధీ ఆసుపత్రిలో పూర్తి ఉచితంగా అత్యాధునిక చికిత్స అందించాం' అని తెలిపారు.

### రైతాంగాన్ని - ప్రజలను మోసం చేయడంలో

# గతంలో బిఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్

**ఆలేరు నియోజకవర్గానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి**
**యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి అధ్యక్షులు అశోక్ గౌడ్**



ఆలేరు నియోజకవర్గానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నదీ జలాల ఏర్పాటుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిధులు వెంటనే మంజూరు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం రాజాపేటలో ఆయనను పోలీసులు హౌస్ అరెస్టు చేసిన సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి కాళేశ్వరం 15 కెనాల్ ప్యాకేజ్ ద్వారా రాజపేట ఆలేరు నియోజకవర్గనికి నీరు అందించాలని బసవపురం భూభాధితులను ఆదుకునీ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని సాగునీటి జలాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాకు అందించాలని ధాన్యం కొనుగోలు వేగవంతం చేయవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్నదన్నారు. కేంద్రం మీద నెపం నెట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చూస్తున్నదని రైతులను మోసం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తే భారతీయ జనతా పార్టీ ఊరుకునే పరిస్థితి లేదని రైతుల పక్షనా నిలబడి ప్రతి గింజ కొనే విధంగా చూస్తామని జిల్లా పార్టీ పక్షాన హెచ్చరించారు. ఇట్టి విషయం జిల్లాకు వస్తున్న ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి బిజెపి తరపున తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా గృహ నిర్బంధం చేయడం జిల్లాలోని కార్యకర్తలను అరెస్టు చేయడం సబబు కాదన్నారు. గతంలో ఉన్న బిఆర్ఎస్ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని - ప్రజలను మోసం చేస్తున్నారని, అక్రమ అరెస్టులను ఇకనైనా మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాకు చెందిన రైతులందరిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# చిలుకోయలపాడులో రైతులపై అగ్నిదుర్ఘటన కలకలం

### మోటార్లు, విద్యుత్ పరికరాలు దగ్ధం.. గ్రామంలో తీవ్ర ఆర్థిక నష్టం

**హైదరాబాద్ పల్స్, మే 28, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం చిలుకోయలపాడు గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదం రైతు కుటుంబాల్లో తీవ్ర కలకలం రేపింది. వ్యవసాయ బావుల వద్ద ఉన్న విద్యుత్ పరికరాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు స్థానిక రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో మోటార్లు, విద్యుత్ వైర్లు, స్టార్టర్ పెట్టెలు, పైపులు పూర్తిగా దగ్ధమై భారీ ఆస్తి నష్టం జరిగింది. బోయిన రజిత్, సందీప్, అరుణలకు చెందిన మూడు వ్యవసాయ మోటార్లు, పైపులు కాలిపోవడంతో సుమారు లక్ష యాభై వేల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. అదే విధంగా సైదయ్య, కొత్త యాకంబరం, కోమరగిరి బ్రహ్మ, వీరభద్రాచారి, పిట్టల సత్యం, రామూర్తి, నాగటి ఉప్పలయ్య, సుధాకర్‌లకు చెందిన విద్యుత్ సామగ్రి కూడా మంటల్లో కాలిపోవడంతో మొత్తం నష్టం మరింత పెరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే ఎక్కువ భాగం సామగ్రి కాలిపోయినట్లు తెలుస్తోంది. వ్యవసాయ పనుల కోసం అప్పులు చేసి కొనుగోలు చేసిన పరికరాలు ఒక్కసారిగా నాశనం కావడంతో రైతు కుటుంబాలు తీవ్ర ఆవేదనలో మునిగిపోయాయి. పంటలకు నీరందించే ప్రధాన మోటార్లు కాలిపోవడంతో రాబోయే రోజుల్లో సాగు పనులు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువుల ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ ఘటన తమపై మరింత భారంగా మారిందని వారు వాపోయారు. గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే మంటలు పెట్టినట్లు అనుమానం వ్యక్తం చేసిన గ్రామస్తులు, ఘటనపై



సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను వెంటనే గుర్తించాలని పోలీసులను కోరుతున్నారు. అలాగే ప్రభుత్వం స్పందించి బాధిత రైతులకు తక్షణ పరిహారం, కొత్త వ్యవసాయ పరికరాలు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మేడ్చల్‌లో బయటపడ్డ ఉగ్రలింకులు.. పాక్ ముఠాకు మంత్రుల వివరాలు చేరవేత!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్‌లోని మేడ్చల్ ప్రాంతంలో మరోసారి ఉగ్రవాద కుట్రలు బయటపడ్డాయి. మేడ్చల్ పోలీసులు 22 ఏళ్ల హోటల్ వెయిటర్ జయాద్ ఖాన్ అలియాస్ ఆదిల్ ఖాన్ ను అరెస్టు చేశారు. ఇతడు పాకిస్థాన్‌లోని గ్యాంగ్‌స్టర్ - ఉగ్రవాది షెహజాద్ భట్టి ముఠాతో సంప్రదింపులు జరిపి, దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు.

**పాకిస్థాన్ గ్యాంగ్‌స్టర్ తో మేడ్చల్ హోటల్ వెయిటర్ సంప్రదింపులు**

జయాద్ ఖాన్ ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందినవాడు. ఫిబ్రవరి 2026 నుంచి మేడ్చల్‌లోని ఒక హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తున్నాడు. నాలుగోతరగతి వరకు మాత్రమే చదువుకున్న ఇతడు 2021 నుంచి ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉంటూ, టాయ్ పిస్టల్‌తో వీడియోలు పోస్ట్ చేస్తూ సోషల్ మీడియా ఫాలోయింగ్ పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2026 జనవరిలో పాకిస్థాన్ గ్యాంగ్‌స్టర్ షెహజాద్ భట్టి అనుచరులైన అబిద్ జట్, రాణా హుస్సేన్‌లతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సంప్రదింపులు ప్రారంభించాడు.

**వాట్సాప్ చాట్లు, కాల్ రికార్డులతో దర్యాప్తు**

పోలీసుల విచారణలో తేలిన విషయాల ప్రకారం, షెహజాద్ భట్టి ముఠా సభ్యులు జయాద్‌ను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యక్తిగత సహాయకుడి ఫోన్ నంబర్ ఇవ్వాలని కోరారు. అయితే జయాద్ బహిరంగంగా అందుబాటులో ఉన్న యూపీ క్యాబినెట్ మంత్రుల ఫోన్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలను వారికి పంపాడు. దానికి బదులుగా తనకు ఆయుధాలు సరఫరా చేయాలని కోరినట్లు వాట్సాప్ చాట్లు, కాల్ రికార్డుల ద్వారా బయటపడింది.




**ఉగ్రవాద మూకతో సంబంధాలు ఉన్నట్టు అనుమానాలు**

షెహజాద్ భట్టికి పాకిస్థాన్ ఐ ఎస్ ఐ మరియు తెహ్రీక్-ఎ-తాలిబన్-ఎ-హిందుస్థాన్‌తో సంబంధాలు ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ కేసులో మే 23న జయాద్ ఖాన్‌ను అరెస్టు చేసిన పోలీసులు సెక్షన్ 152 (దేశ వ్యతిరేక కార్యకలాపాలు) మరియు సెక్షన్ 61(2) కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న జయాద్‌ను ఇంటెలిజెన్స్ అధికారులు కూడా లోతుగా విచారిస్తున్నారు.

**మేడ్చల్ లో బయటపడ్డ ఉగ్ర లింకులు**

హైదరాబాద్‌లో ఇలాంటి ఉగ్రవాద లింకులు బయటపడడం రాష్ట్ర భద్రతా యంత్రాంగానికి సవాలుగా మారింది. జయాద్ ఖాన్ ఒక సామాన్య హోటల్ ఉద్యోగిగా ఉంటూ ఎలా ఉగ్రవాద ముఠాలతో చేతులు కలిపాడనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ కేసులో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయో బయటపెట్టే అవకాశం ఉంది. తెలంగాణలో ఉగ్రవాద ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా ఉండాలని రాజకీయ నాయకులు, భద్రతా నిపుణులు సూచిస్తున్నారు.

# తెలంగాణలోనూ..... యూనిఫాం సివిల్ కోడ్ : ఎన్. రామచందర్ రావు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, తెలంగాణ బ్యూరో :** దేశంలోని పౌరులందరికీ ఒకే చట్టం వర్తింపజేయాలన్న లక్ష్యంతో తీసుకువస్తున్న యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) ను తెలంగాణలోనూ తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ్ మహాభియాన్ కార్యక్రమంలో రామచందర్ రావు పాల్గొని ప్రసంగించారు. దేశంలో యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఉత్తరాఖండ్, గుజరాత్ ఈ చట్టాన్ని అమలు చేస్తుండగా, నిన్న అసోం అసెంబ్లీ కూడా ఆమోదం తెలిపింది. యూనిఫాం సివిల్ కోడ్ అనేది మన సిద్ధాంతం, మన మేనిఫెస్టోలో భాగంగా ఉంది. అదే విధంగా ఆర్టికల్ 370 రద్దు చేయాలని కూడా మన సిద్ధాంతంలో ఉండే.. రద్దు చేసినం. ఈ ఆర్టికల్ వల్ల నష్టం ఏంటో కూడా మనం గతంలో చెప్పినం. ఇప్పుడు యూనిఫాం సివిల్ కోడ్ కూడా ఎందుకు రావాలో ప్రజలకు చెప్పాలి. తెలంగాణలో కూడా యూనిఫాం సివిల్ కోడ్ రావాలి. ఇది దేశానికి అవసరం. యూసీసీ అనగానే చాలా మంది ఒక మతానికో, ఒక వర్గానికో వ్యతిరేకం అనుకుంటారు. అసోం తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయం.. దాన్ని స్వాగతించాలి. ఈ కోడ్ వల్ల ఈ దేశంలో ఉన్న మహిళలకు, చిన్నారులకు లభించే హక్కులకు న్యాయం జరుగుతుంది అని ఆయన తెలిపారు. కొన్ని మతాల్లో మహిళలకు హక్కుల్లేవు. ఈ కోడ్ దేశ వ్యాప్తంగా అమల్లోకి వస్తే మహిళలకు హక్కులు వస్తాయి. పిల్లలకు ఒకే చట్టం రాబోతుంది. ఈ కోడ్ వల్ల రాబోయే రోజుల్లో అన్ని మతాలకు, కులాలకు, వర్గాలకు మేలు జరుగుతుంది.. షెడ్యూల్ తెగలకు తప్ప. దేశంలోని ముస్లిం మహిళలు కూడా ఈ కోడ్‌ను స్వాగతించారు అని రామచందర్ రావు గుర్తు చేశారు




# 'స్వచ్ఛందంగా వెళ్లకపోతే బలవంతంగా పంపిస్తాం'..

## వలసదారులపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, సెంట్రల్ బ్యూరో:** దేశంలోకి అక్రమంగా చొరబడిన వలసదారులను గుర్తించి, వారిని వెనక్కి పంపించే విషయంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. గురువారం గుజరాత్‌లోని గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో రూ. 340 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జాతీయ భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, సరిహద్దుల రక్షణ కోసం కఠిన చర్యలు కొనసాగుతాయని పునరుద్ఘాటించారు.

**బెంగాల్‌లో మారుతున్న పరిస్థితులు..**

ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో మారుతున్న పరిస్థితులపై అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. గతంలో మమతా బెనర్జీ పాలనలో నిత్యం చొరబాట్లు జరిగేవని, కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం వలసదారులు తమంతట తామే స్వచ్ఛందంగా వెనక్కి వెళ్తున్నారని, అలా వెళ్లేవారిపై ఎలాంటి కేసులు ఉండవని తెలిపారు. ఒకవేళ స్వచ్ఛందంగా వెళ్లకపోతే, బలవంతంగానైనా వెనక్కి పంపిస్తామని హెచ్చరించారు.

**బీఎస్ఎఫ్‌కు వేగంగా భూమి కేటాయింపు**

సరిహద్దుల్లో ఫెన్సింగ్ (కంచె) పనుల అడ్డంకులు తొలగిపోవడంపై హోంమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ మౌలిక వసతుల బలోపేతం కోసం కేవలం వారం రోజుల్లోనే 600 హెక్టార్ల భూమిని కేటాయించినందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలిపారు.

గుజరాత్‌లో పలు కార్యక్రమాలు

మూడు రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా అమిత్ షా పలు సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) నిధుల కింద నిర్మించిన జెద్వా గ్రామీణ చెరువు పునరుద్ధరణ, నూతన గ్రంథాలయాలు, ప్రాథమిక పాఠశాల భవనాలను ప్రారంభించారు. వీర్ సావర్కర్ జయంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం అహ్మదాబాద్‌లో 'భారత్ మాతా స్క్వేర్'తో పాటు మాతా ఉమియా ధామ్ కాంప్లెక్స్‌లో హాస్టల్ భవనాన్ని ప్రారంభించనున్నారు. భారత్‌లో జరగబోయే ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్, వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ వంటి అంతర్జాతీయ క్రీడల మౌలిక వసతుల సన్నద్ధతపై షాహిబాగ్ సర్క్యూట్ హౌస్‌లో జరిగే ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి కూడా ఆయన అధ్యక్షత వహించనున్నారు.

# ఇజ్రాయెల్ కు మద్దతు ఇస్తే చంపి పడేస్తం

## పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ కు లష్కరే తోయిబా వార్నింగ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, ఇస్లామాబాద్:** ఇరాన్-అమెరికా మధ్య మధ్యవర్తిత్వం వహిస్తోన్న పాకిస్తాన్ ట్రంప్ ప్రతిపాదనతో ఇరకాటంలో పడింది. ఇజ్రాయెల్ తో దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ఉద్దేశించిన 'అబ్రహం ఒప్పందాల్లో' చేరాలని అమెరికా ఒత్తిడి చేయడంతో పాకిస్థాన్ పరిస్థితి ముందు గొయ్యి వెనుక నుయ్యిలా మారింది. ఒకవైపు ట్రంప్ ఒత్తిడి.. మరోవైపు దేశ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుండటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పాకిస్తాన్ ప్రభుత్వం పడిపోయింది. ఈ క్రమంలో పాకిస్తాన్ ప్రభుత్వానికి, ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ కు ఉగ్రవాద సంస్థ లష్కర్-ఎ-తైబా డిప్యూటీ చీఫ్, పహల్గామ్ దాడి సూత్రధారి సైఫుల్లా కసూరి వార్నింగ్ ఇచ్చారు. పాకిస్తాన్ ప్రభుత్వం, అసిమ్ మునీర్ తీసుకునే ఏ నిర్ణయమైనా ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఉంటే వారిపై యాక్షన్ సీరియస్‌గా ఉంటుందని హెచ్చరించారు. ఓ బహిరంగ సభలో కసూరి మాట్లాడుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోలో.. ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడానికి ప్రయత్నించే ఏ పాకిస్తానీ నాయకుడైనా హింసాత్మక పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని కసూరి హెచ్చరించాడు. అసిమ్ మునీర్, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌ల పేర్లను ప్రస్తావిస్తూ.. పాకిస్థాన్‌లో ఏ నాయకుడైనా ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడానికి ప్రయత్నిస్తే వారిని చంపేస్తామని లేదా సర్వనాశనం చేస్తామని డెడ్లీ వార్నింగ్ ఇచ్చాడు. పాకిస్తాన్ ప్రభుత్వం, ఆ దేశ గూఢచార సంస్థ ఐఎస్ఐ పెంచి పోషించే టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్ అయినా లష్కరే తోయిబా ఏకంగా ప్రభుత్వానికి, ఆర్మీ చీఫ్ కు హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం.




# బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని శాసన సభ్యురాలి క్యాంపు కార్యాలయంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి బక్రీద్ పండుగ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్‌కు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు అందించారు. బక్రీద్ పండుగ విశిష్టతను వివరించిన ఎమ్మెల్యే, జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, పార్టీ అధ్యక్షుడు జబోరే రవీందర్, సాయి శ్రవణ్, రెబ్బెన మాజీ జెడ్పీటీసీ బాపురావు తదితరులు పాల్గొన్నారు.

# లింగాపూర్‌లో వాహన తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం పిట్టగూడ రోడ్డుపై ఎస్ఐ చుంచు గంగన్న సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులను పరిశీలించి వాహన పత్రాలు తనిఖీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. అనుమానాస్పద సంఘటనలు కనిపిస్తే డయల్ 100కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలను కోరారు.




# ఇ20 పెట్రోల్ ఎఫెక్ట్: మైలేజ్ తగ్గి లబోదిబోమంటున్న ఓనర్లు..!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28 :**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇ20 (20% ఇథనాల్, 80% పెట్రోల్) ఇంధనం.. పాత వాహనదారుల పాలిట శాపంగా మారుతోంది. రోజురోజుకూ పడిపోతున్న మైలేజ్, పెరుగుతున్న ఇంజన్ రిపేర్లతో సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో, ఆటోమొబైల్ రంగాన్ని మరో మలుపు తిప్పుతూ.. దేశంలోనే మొట్టమొదటి 100% ఇథనాల్‌తో నడిచే ఇ 100' బైక్‌ను జూన్ 3న లాంచ్ చేసేందుకు హీరో మోటోకార్ప్ సిద్ధమైంది. పాత బండ్ల కష్టాలేంటి? కొత్తగా వస్తున్న ఇ 100 టెక్నాలజీ ఏంటి? పూర్తి వివరాలు చూద్దాం.

**సగం బండ్ల మైలేజ్ ధమాల్**

2023కి ముందు కొనుగోలు చేసిన పెట్రోల్ వాహనాల్లో ఇ20 పెట్రోల్ వాడకం వల్ల జరుగుతున్న నష్టంపై 'లోకల్ సర్కిల్స్'దేశవ్యాప్తంగా ఒక భారీ సర్వే నిర్వహించింది. దాదాపు 301 జిల్లాల నుంచి 50 వేల మందికి పైగా ఇందులో పాల్గొన్నారు. గత 9 నెలలుగా తమ వాహనం మైలేజ్ దారుణంగా పడిపోయిందని ప్రతి ఇద్దరిలో ఒకరు (50%) వాపోయారు. ఇక 29% మంది వాహనదారులు.. అసాధారణ స్థాయిలో వాహనం విడిభాగాలు పాడవుతున్నాయని, ఇంజన్, ఫ్యూయల్ ట్యాంక్, కార్బొరేటర్ రిపేర్లకు వస్తున్నాయని రిపోర్ట్ చేశారు. మైలేజ్ డ్రాప్ కేవలం 1-6% మాత్రమే ఉంటుందని అధికారులు చెబుతున్నా, ట్రాఫిక్ ఉండే సిటీల్లో వాస్తవ పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, ఫ్యూయల్ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని మిడిల్ క్లాస్ ఓనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇంజన్లు ఎందుకు పాడవుతున్నాయి?**

గత 15 ఏళ్లలో అమ్ముడైన 80% వాహనాలు ఇ5 లేదా ఇ10 (10% ఇథనాల్) బ్లెండెడ్ ఇంధనానికి మాత్రమే సూట్ అయ్యేలా డిజైన్ చేయబడ్డాయి. కానీ, ఇప్పుడు బంకుల్లో ఎక్కడ చూసినా ఇ20 పెట్రోల్ డీఫాల్ట్‌గా మారిపోయింది. ఇథనాల్‌కు తేమను గ్రహించే గుణం ఉంటుంది. దీనివల్ల పాత వాహనాల్లోని రబ్బర్, ప్లాస్టిక్ పార్ట్స్ త్వరగా పాడైపోతాయి. ఇంజన్ త్వరగా హీట్ ఎక్కడం, కోల్డ్ స్టార్ట్ ట్రబుల్స్, యాక్సిలరేషన్ తగ్గడం లాంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

**పాత బండ్లకు కష్టాలు.. 'ఫ్లెక్స్ ఫ్యూయల్'తో లాభాలు**

ఒకవైపు పాత బండ్లు కేవలం 20% ఇథనాల్‌ను కూడా తట్టుకోలేక మొరాయిస్తుంటే, ఆటోమొబైల్ కంపెనీలు మాత్రం ఏకంగా 100% ఇథనాల్ ఇంధనానికి సపోర్ట్ చేసే 'ఫ్లెక్స్ ఫ్యూయల్' ఇంజన్ల వైపు మొగ్గుచూపుతున్నాయి. సాధారణ పెట్రోల్ కంటే ఇథనాల్ రేటు తక్కువగా ఉండటం వల్ల సామాన్యుడికి ఇంధన ఖర్చుల భారం భారీగా తగ్గుతుంది. ఈ క్రమంలోనే దేశంలోనే తొలి ఇ100 బైక్‌ను హీరో మోటోకార్ప్ జూన్ 3న అధికారికంగా మార్కెట్లోకి తీసుకురానుంది. ఈ కొత్త బైక్ పేరు ఏమిటనేది కంపెనీ ఇంకా సస్పెన్స్‌లోనే ఉంచింది. ఇప్పటికే హీరో సంస్థ తన పాపులర్ మోడల్స్ అయిన హెచ్.ఎఫ్ డీలక్స్, స్ప్లెండర్లకు ఫ్లెక్స్ ఫ్యూయల్ అనుమతులు తెచ్చుకోగా, సుజుకి జిక్సర్ ఎస్.ఎఫ్ 250, హోండా సి.బి 300ఎఫ్ మోడల్స్ ఇ85 (85% ఇథనాల్) సామర్థ్యంతో అందుబాటులో ఉన్నాయి. రాబోయే రోజుల్లో ఈ ఫ్లెక్స్ ఫ్యూయల్ బండ్లకు విపరీతమైన డిమాండ్ ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పాత బండ్ల టెక్నాలజీతో ఎదురవుతున్న సమస్యలకు.. ఈ అడ్వాన్స్‌డ్ ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్స్ ఖచ్చితంగా చెక్ పెట్టనున్నాయి

## ముగ్గురు నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ గురువారం తన కార్యాలయంలో ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులు పంపిణీ చేశారు.కెరమెరి మండలం గోయగం గ్రామానికి చెందిన వడాయి నాను బాయికి --- 35,000- ఆసిఫాబాద్ మండలం కొమ్ముగూడకు చెందిన గాడాల సరస్వతి --- 60,000 - వాంకిడి మండలం కోమటిగూడకు చెందిన సోనుర్లే లచుంబై --- 60,000 ఆపదకాలంలో నిరుపేదలను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని, అర్హులందరికీ పథకాలు అందేలా కృషి చేస్తామని శ్యామ్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గాధవేణి మల్లేష్, ఉప సర్పంచ్ దీపక్ ముండే తదితరులు పాల్గొన్నారు.

## ఈ కోడికూర తింటే మూడేళ్ళు జైలుశిక్ష!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28 :**
మన తెలుగు వంటల్లో చికెన్ కూరకు ప్రత్యేక స్థానం ఉంది. పండగలైనా, శుభకార్యాలైనా ఏదైనా సరే చికెన్ ఉండాల్సిందే. అయితే ఈ కోడికూర తింటే అనవసరపు రిస్క్ ఎదుర్కోవాల్సి వస్తుంది. మూడేళ్ళు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. అడవి కోడి లేదా జంగ్లీ ముర్గా అని పిలువబడే ఈ కోడి సాధారణ గ్రామాల కోడి కాదు. ఇది ప్రధానంగా అడవుల్లోనే నివసిస్తుంది.

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అడవుల్లో కోళ్ళు**
బూడిద రంగులో ఉండే ఈ కోళ్ళు నేలపై తిరుగుతూ గింజలు, చెదలు, కీటకాలు తిని జీవిస్తాయి. ఏదైనా అలికిడి వినిపిస్తే వెంటనే చెట్లపైకి ఎగురుతాయి. భారతదేశంలోని అనేక అటవీ ప్రాంతాల్లో ఇవి కనిపిస్తాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అడవుల్లో కూడా ఈ అడవి కోళుఉన్నాయి. ఈ అడవి కోడిని వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 కింద రక్షిత జాతిగా ప్రకటించారు.

**వీటి వేట నిషేధం**
దీన్ని వేటాడడం, పట్టుకోవడం, చంపడం, మాంసం నిల్వ ఉంచడం లేదా విక్రయించడం అన్నీ చట్టవిరుద్ధం. ఈ నేరం నిరూపితమైతే మూడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు భారీగా జరిమానా కూడా విధించవచ్చు. కేసు తీవ్రత బట్టి శిక్ష మారవచ్చు. అడవి కోళ్ళ సంఖ్య క్రమంగా తగ్గుతోంది. అడవుల నరికివేత, అక్రమవేట వలన ఈ జాతి అంతరించి పోయే ప్రమాదం ఉంది. ప్రకృతి సమతౌల్యంలో ఈ కోళ్ళు కీలక పాత్ర పోషిస్తాయి.

**వీటిని వేటాడినా,బాధ పెట్టినా చట్ట విరుద్ధం**
అడవి కోళ్ళు ఆహార గొలుసులో భాగం కావడం వల్ల వాటి సంరక్షణ అవసరం. ప్రభుత్వం పర్యావరణ సంరక్షణ కోసం ఇలాంటి కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. అడవుల్లో ఇలాంటి వన్యప్రాణులు కనిపిస్తే వాటికి ఎలాంటి హాని చేయకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు తీయాలనే ఆసక్తితో కూడా వేటాడటం లేదా బాధపెట్టడం చట్టవిరుద్ధం.

**రక్షిత జాతిలో అడవి కోడి**
మనం తినే చికెన్ సాధారణంగా ఫామ్‌లలో పెంచినవి. కానీ అడవి కోడి పూర్తిగా వన్యప్రాణి. దీన్ని గుర్తించి సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యతగా చెప్తూ ఈ కోళ్ళ వేట కొనసాగకుండా దీనిని రక్షిత జాతిలో చేర్చారు. . అందుకే ఈ కోడి కూర తినకూడదు. ఒకవేళ తిన్నారో మూడేళ్ళు జైలు శిక్ష అనుభవించాల్సిందే.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం"
అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

## మానవత్వానికి ప్రతీకగా లిటిల్ మైండ్ స్కూల్ యాజమాన్యం

**ఎర్రయ్య కుటుంబానికి అండ**

**డోర్నకల్, బూర్గుపహాడు గ్రామంలో విషాదంలో ఉన్న కుటుంబానికి సహాయం**

**హైదరాబాద్ పల్స్, మే 28, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండలం బూర్గుపహాడు గ్రామానికి చెందిన చెరుకుపల్లి ఎర్రయ్య ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న ఎర్రయ్య మరణంతో భార్య లక్ష్మి, పిల్లలు ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న చిలుకోడు లిటిల్ మైండ్ స్కూల్ యాజమాన్యం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచింది.

**కుటుంబాన్ని పరామర్శించిన యాజమాన్యం**
లిటిల్ మైండ్ స్కూల్ కరస్పాండెంట్ గోగుల మహేశ్వరి, ప్రిన్సిపాల్ మల్సూర్ బాధిత కుటుంబాన్ని స్వయంగా కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి మనోబలాన్ని కల్పించారు.

**ఆర్థిక సహాయం, విద్యకు హామీ**
ఈ సందర్భంగా రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే ఎర్రయ్య పిల్లల విద్య బాధ్యతను పూర్తిగా తీసుకుంటామని ప్రకటించారు. పదో తరగతి వరకు ఎలాంటి ఫీజులు లేకుండా తమ పాఠశాలలో విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎర్రయ్య భార్య లక్ష్మికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు.



**గ్రామ ప్రజల ప్రశంసలు**
కష్టకాలంలో ఒక కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న లిటిల్ మైండ్ స్కూల్ యాజమాన్యం చర్యను గ్రామ ప్రజలు ప్రశంసించారు. బూర్గుపహాడు గ్రామం మరియు ఎస్సీ కాలనీ వాసులు ఈ సహాయాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో మానవత్వం ఇంకా జీవిస్తోందని నిరూపించిన ఈ చర్య అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

## పసిడి మార్కెట్ లో పెను భూకంపం! కుప్పకూలిన రేట్లు..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28 :**
బంగారం కొనాలనుకునే వారికి ఇది నిజంగానే ఊరటనిచ్చే వార్త. అంతర్జాతీయ మార్కెట్లో బులియన్ ధరలు దారుణంగా పతనమయ్యాయి. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య ముదురుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణ భయాలు, అంతర్జాతీయ మార్కెట్లో యుఎస్ డాలర్ విపరీతంగా బలం పుంజుకోవడం వంటి ప్రధాన కారణాల వల్ల బంగారం ధరలు రెండు నెలల కనిష్ట స్థాయికి పడిపోయాయి.




**అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్స్ ప్రకారం..**
స్పాట్ గోల్డ్ ధర ఏకంగా 2 శాతం వరకు తగ్గి, ఔన్సుకు సుమారు వి4,365 మార్కుకు పడిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరి చివరలో ఇరాన్ వివాదం మొదలైనప్పటి నుండి చూసుకుంటే బంగారం ధరలు ఏకంగా 17 శాతం కంటే ఎక్కువ పతనమై, ఈ ఏడాది సాధించిన లాభాలన్నింటినీ దాదాపుగా తుడిచిపెట్టేయడం గమనార్హం.

**మధ్యప్రాచ్యంలో ముదురుతున్న రణరంగం!**
ఒకవైపు శాంతి చర్చలు జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. హార్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా బలగాలు హఠాత్తుగా వైమానిక దాడులు చేశాయి. దీనికి ప్రతిగా, తమపై దాడి ప్రారంభించిన అమెరికా బేస్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఎదురుదాడికి దిగిందని సమాచారం. మరోవైపు కువైట్ వైమానిక దళాలు కూడా క్షిపణి, డ్రోన్ బెదిరింపులను తిప్పికొట్టాయి.

## మళ్లీ కోవిడ్ గుసగుసలు.. పెరుగుతున్న కేసులు.!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28 :**
కనుమరుగైపోయిందనుకున్న కరోనా మహమ్మారి మరోసారి మెల్లగా కోరలు చాస్తోంది. తమిళనాడు రాజధాని చెన్నై నగరంలో ఇటీవల కోవిడ్-19 కేసుల సంఖ్యలో స్వల్ప పెరుగుదల నమోదు కావడం ప్రజల్లో కాస్త టెన్షన్‌ను రేకెత్తిస్తోంది. గత కొన్ని వారాలుగా ఫ్లూ , జ్వరాల లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందని, పరీక్షలు చేయగా అందులో కోవిడ్ పాజిటివ్ రేటు ఎక్కువగా ఉంటోందని ప్రముఖ వైద్యులు గుర్తించారు.అయితే, ఈ ఇన్‌ఫెక్షన్ల తీవ్రత చాలా తేలికపాటిదిగా ఉండటంతో ప్రజలు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు భరోసా ఇస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసులలో స్వల్ప జ్వరం, గొంతు నొప్పి, పొడి దగ్గు, విపరీతమైన అలసట వంటి సాధారణ లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయి. బాధితులకు ఔట్‌పేషెంట్ పద్ధతిలోనే మందులు ఇస్తూ ఇంటి వద్దే చికిత్స పొందేలా సిఫార్సు చేస్తున్నారు. గత కోవిడ్ వేవ్‌ల తరహాలో ఆసుపత్రుల్లో చేరడం గానీ, ఆక్సిజన్ అవసరం పడటం గానీ, తీవ్ర అస్వస్థతకు గురికావడం గానీ జరగడం లేదని వైద్యులు స్పష్టం చేశారు.

**ఓమిక్రాన్ ఉప-వేరియంట్లే కారణమా?**
ప్రస్తుతం వేగంగా వ్యాప్తి చెందుతున్నప్పటికీ తక్కువ తీవ్రతను కలిగి ఉన్న ఓమిక్రాన్ ఉప-వేరియంట్ల వల్లే ఈ కాలానుగుణ మార్పులు జరుగుతున్నాయని నిపుణులు భావిస్తున్నారు. సాధారణ జలుబు లేదా సీజనల్ వైరల్ ఇన్‌ఫెక్షన్ అనుకుని నిర్లక్ష్యం చేయకుండా, లక్షణాలు మూడు నాలుగు రోజులకు మించి కొనసాగితే కచ్చితంగా కోవిడ్ పరీక్ష చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు.



కోవిడ్ అనేది పూర్తిగా అంతం కాలేదని, వాతావరణ మార్పులను బట్టి ఇది కాలానుగుణంగా పెరుగుతూ తగ్గుతూ ఉంటుందని వైద్యులు గుర్తు చేస్తున్నారు.

## భూమి అమ్మి భార్యను చదివిస్తే
## ప్రభుత్వ ఉద్యోగం రాగానే ప్రియుడితో జంప్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28, బీహార్ బ్యూరో:**
పెళ్లి అంటే భార్యభర్తల మధ్య నమ్మకం. జీవితాంతం కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడు ఉంటామనే భరోసా. కానీ ఈ బంధానికి మచ్చ తెచ్చేలా వ్యవహరించిందో భార్య. భర్త కష్టపడి తనను చదివిస్తే ప్రభుత్వ ఉద్యోగం రాగానే భర్తను, కుమారుడిని వదిలేసి ప్రియుడితో జంప్ అయిపోయింది. కట్టుకున్న వాడిని వదిలేసి ఏకంగా ప్రియుడితో అద్దె ఇంట్లో మకాం పెట్టి భర్త రెడ్ హ్యాండెడ్?గా దొరికిపోయింది. ఈ షాకింగ్ ఘటన బీహార్ లోని వైశాలి జిల్లాలో వెలుగు చూసింది. సదరు మహిళ భర్త వెల్లడించిన ప్రకారం ఈ కేసులోని వివరాలు ఇలా ఉన్నాయి.



**2013లో వివాహం:**
హాజీపూర్ నగర పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాధితుడికి 2013లో వివాహమైంది. పెళ్లయిన తర్వాత భార్యను ఉన్నత చదువులు చదివించాలని అతడు ఆశపడ్డాడు. ఆమె చదువుకు ఎటువంటి ఆటంకం కలగకూడదని పట్టణంలో ఒక అద్దె గది తీసుకుని పగలు రాత్రి తేడా లేకుండా కష్టపడి పని చేసి ఆర్థికంగా సహకారం అందించాడు. ఈ క్రమంలో ఆమె చదువులకు ఆర్థిక ఇబ్బందుల ఏర్పడితే తన పూర్వీకుల నుంచి వచ్చిన సొంత భూమిని సైతం అమ్మేసి ఆమె చదువుల కోసం ఆ డబ్బు వెచ్చించాడు. భర్త పడ్డ కష్టంతో ఆమె గ్రాడ్యుయేషన్, బీఈడీ పూర్తి చేసి, బీపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సంపాదించింది. ఇంత వరకు బాగానే ఉన్న ఉద్యోగం వచ్చాక ఆమె ప్రవర్తనలో మార్పు మొదలైంది.

**ట్రైనింగ్ సమయంలో ప్రియుడితో కాంటాక్ట్:**
ఉద్యోగం సాధించిన సదరు భార్య ఉపాధ్యాయ శిక్షణ సమయంలో ఆమెకు కాలేజీ రోజుల్లోని పాత మిత్రుడితో మళ్లీ పరిచయం ఏర్పడింది. అది కాస్త అనైతిక బంధానికి దారి తీసింది. ఈ క్రమంలో ఆమె తన భర్తకు గుడ్ బై చెప్పేసిన ఏకంగా ప్రియుడితో అద్దె గదిలో మకాం పెట్టేసింది. భార్య ప్రవర్తనలో మార్పు గమనించిన భర్త మే 23 వ తేదీన లిచ్చవి నగర్ లోని ఒక అద్దె ఇంట్లో తన భార్యతో పాటు ఆమె ప్రియుడితో కలిసి ఉండగా రెడ్ హ్యాండెడ్?గా పట్టుకున్నాడు. ఆ వెంటనే పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. అయితే పోలీసులు వచ్చే లోపు స్థానికులు, ఇంటి యజమాని గొడవ జరగకుండా సర్దిచెప్పారని బాధితుడు ఆరోపించాడు.

**ప్రియుడితోనే ఉంటా:**
బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సిటీ పోలీస్ స్టేషన్ ఎస్?హెచ్ఓ సికందర్ కుమార్ మాట్లాడుతూ సదరు మహిళతో పాటు ఆమె ప్రియుడిని అరెస్టు చేసి స్టేషన్?కు తీసుకువచ్చామన్నారు. ఆమె తన భర్తతో ఉండలేలని ఇకపై ప్రియుడితోనే జీవిస్తానని చెబుతోందని పోలీసులు వెల్లడించారు. కాగా తల్లి చేసిన పనికి పదేళ్ల ఆమె బాలుడు తీవ్ర ఆరోపణలు చేశాడు. ఇకపై ఆమెతో కలిసి జీవించలేనని, ఆమెతో వెళ్లడానికి నిరాకరించినట్లు పోలీసులు వెల్లడించారు.

# జపాన్‌లో 'బంగినపల్లి, అల్ఫోన్సో' మామిడికి నో ఎంట్రీ

## : 20 ఏళ్ల తర్వాత బ్యాన్ విధించడానికి అసలు కారణమిదే!






**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 28 :** వేసవి కాలం వచ్చిందంటే చాలు.. ప్రపంచవ్యాప్తంగా మన భారతీయ మామిడి పండ్లకు ఉండే క్రేజే వేరు. ముఖ్యంగా మన అల్ఫోన్సో, బంగినపల్లి రుచికి విదేశీయులు సైతం ఫిదా అవుతుంటారు. అయితే, ఏకంగా 20 ఏళ్ల తర్వాత భారతీయ మామిడి ఎగుమతులపై జపాన్ సంచలన నిషేధం విధించింది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన తనిఖీల్లో పెస్ట్-కంట్రోల్ విధానాల్లో లోపాలు గుర్తించడంతో జపాన్ ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

**ఏం జరిగింది? ఎందుకు బ్యాన్ చేశారు?**

మామిడి పండ్లలో ఫ్రూట్ ఫ్లైస్ లాంటి పురుగులు లేకుండా చూడటం కోసం జపాన్ ఎప్పుడూ "జీరో-టాలరెన్స్" పాలసీని ఫాలో అవుతుంది. విదేశాలకు ఎగుమతి చేయడానికి ముందు మామిడి పండ్లను రసాయనాలు లేకుండా వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ చేయడం తప్పనిసరి.మార్చి నెలలో ఉత్తరప్రదేశ్‌లోని రెహ్మాన్‌పూర్ ఫెసిలిటీలో జపాన్ క్వారంటైన్ అధికారులు తనిఖీలు చేశారు. అక్కడ ఫ్యూమిగేషన్, డిస్‌ఇన్‌ఫెక్షన్ ప్రక్రియల్లో కొన్ని సాంకేతిక లోపాలు ఉన్నట్లు గుర్తించారు. దీని ఫలితంగా.. మార్చి 25, 2026 తర్వాత జారీ చేసిన ఇన్‌స్పెక్షన్ సర్టిఫికెట్లు ఉన్న మామిడి షిప్‌మెంట్లను ఇకపై అనుమతించబోమని జపాన్ యోకోహామా ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ తేల్చిచెప్పింది.

**20 ఏళ్లలో ఇదే తొలిసారి**

గతంలోనూ ఫ్రూట్ ఫ్లైస్ భయంతో జపాన్ ఇలాగే బ్యాన్ విధించింది. అయితే భారత్ తన ట్రీట్‌మెంట్ ప్రొటోకాల్స్‌ను మరింత మెరుగుపరుచుకున్న తర్వాత, 2006లో ఆ బ్యాన్‌ను ఎత్తివేసింది. మళ్లీ దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఇప్పుడు నిషేధం విధించడం గమనార్హం.

**రైతులకు.. ఎగుమతిదారులకు కోలుకోలేని దెబ్బ**

జపాన్ మార్కెట్ మనకు అతిపెద్దది కాకపోయినా.. అల్ఫోన్సో, బంగినపల్లి, కేసర్, లంగ్రా వంటి ప్రీమియం రకాలకు అక్కడ భారీ ధర పలుకుతుంది. ఈ బ్యాన్ వల్ల ఎగుమతిదారుల లాభాలకు భారీ గండి పడనుంది.ఇప్పటికే ఎల్-నినో ప్రభావం, వాతావరణ మార్పుల వల్ల మహారాష్ట్రలోని కొంకణ్ బెల్ట్‌లో అల్ఫోన్సో దిగుబడి 60-70% పడిపోయింది. ప్రభుత్వ సర్వేల ప్రకారం కొన్ని ప్రాంతాల్లో 85-90% వరకు పంట నష్టం జరిగింది. ఈ క్లిష్ట సమయంలో దిగుబడులు తగ్గి అల్లాడుతున్న రైతుల పాలిట జపాన్ బ్యాన్ శాపంగా మారింది. మన క్వాలిటీ కంట్రోల్ సిస్టమ్‌పై ఇతర దేశాలు కూడా అనుమానాలు వ్యక్తం చేసే ప్రమాదం ఉందని ఎగుమతిదారులు ఆందోళన చెందుతున్నారు.

**మామిడి ఉత్పత్తిలో మనమే గ్లోబల్ కింగ్**

ఒకవైపు జపాన్ బ్యాన్ ఆందోళన కలిగిస్తున్నా.. మామిడి ఉత్పత్తిలో మన దేశం 'గ్లోబల్ క్యాపిటల్'గా కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాది (2026) భారత్‌లో 23 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా మామిడి ఉత్పత్తి అవుతుందని అంచనా.యూపీ, ఏపీలదే హవా: మొత్తం జాతీయ ఉత్పత్తిలో సగానికి పైగా వాటా ఉత్తరప్రదేశ్ (26.5% - 27%), ఆంధ్రప్రదేశ్ (21.5% - 22%) రాష్ట్రాలదే.

**రకాల వారీగా:** దశేరి, లంగ్రా రకాలకు యూపీ ఫేమస్ కాగా.. బంగినపల్లి, సఫేదాలకు ఏపీ కేరాఫ్ అడ్రస్. తెలంగాణ (4.5% - 5.0%) రాష్ట్రంలోనూ బంగినపల్లి, ఇమామ్ పసంద్ రకాలకు మంచి డిమాండ్ ఉంది.

**గుజరాత్‌లో బంపర్ దిగుబడి :ఇక** గుజరాత్‌లో ఈ ఏడాది శీతాకాలం ఉష్ణోగ్రతలు అద్భుతంగా అనుకూలించడంతో ప్రీమియం 'గిర్ కేసర్' రకానికి బంపర్ దిగుబడి వచ్చింది. దీన్ని బెస్ట్ వింటేజ్ ఇయర్‌గా వ్యవసాయ నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# అధిక బరువును త్వరగా తగ్గించుకోవాలని చూస్తున్నారా..

**అయితే అలా చేయడం ప్రమాదకరం.. ఎందుకంటే..**



అధిక బరువు కారణంగా తలెత్తే అనారోగ్య సమస్యలపై అవగాహన రావడంతో చాలా మంది బరువు తగ్గే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం బరువు తగ్గడం చాలా మందికి ప్రధాన ఫిట్‌నెస్ లక్ష్యంగా మారింది. అయితే త్వరగా బరువు తగ్గడం ఆరోగ్యానికి మంచిదే అనుకోవడం తప్పని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వేగంగా బరువు తగ్గే ప్రయత్నాలు శరీరానికి అనేక రకాల నష్టాలను కలిగించే అవకాశం ఉందని అంటున్నారు. బరువు తగ్గడం విజయంగా కనిపించినా, లోపల శరీరం బలహీనపడే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు. వేగంగా బరువు తగ్గితే కేవలం కొవ్వు మాత్రమే కాదు, కండరాలు, ఎముకల దృఢత్వం, శరీర బలం కూడా తగ్గిపోతాయి. బయటకు శరీరం సన్నగా కనిపించినా, లోపల శక్తి తగ్గిపోవడం ప్రారంభమవుతుంది. దీనివల్ల భవిష్యత్తులో అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం పెరుగుతుంది.

**కండరాలకు నష్టం..**

త్వరగా బరువు తగ్గడం వల్ల ప్రధానంగా కండరాల నష్టం ఎక్కువగా జరుగుతుంది. ముఖ్యంగా సరిపడా ప్రోటీన్ తీసుకోకపోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల శరీరంలోని లీన్ మజిల్ మాస్ వేగంగా తగ్గిపోతుంది. దీనిని సార్కోపీనియా అని పిలుస్తారు. ఇది శరీర బలాన్ని దెబ్బతీస్తుంది. అలాగే ఎముకలపై పడే ఒత్తిడి తగ్గిపోవడం, పోషకాహార లోపాలు కలగడం వల్ల ఎముకల దృఢత్వం కూడా తగ్గుతుంది. దీని కారణంగా ఫ్రాక్చర్ ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధుల్లో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కండరాలు శరీర మెటబాలిజంలో కీలక పాత్ర పోషిస్తాయి. అవి తగ్గిపోతే మెటబాలిజం మందగిస్తుంది. దీంతో భవిష్యత్తులో బరువు తగ్గడం కష్టమవుతుంది. మరోవైపు తిరిగి బరువు పెరగడం మాత్రం చాలా సులభమవుతుంది. ఇది ఆరోగ్యానికి మరింత ప్రమాదకరంగా మారుతుంది.

**పోషకాహార లోపం వచ్చే చాన్స్..**

ఆహారం తగ్గించడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు కూడా తక్కువగా అందుతాయి. ఐరన్, విటమిన్ బి12, విటమిన్ డి, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాల లోపం వల్ల అలసట, బలహీనత, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. వేగంగా బరువు తగ్గిన వారిలో సాధారణంగా బలహీనత, అలసట, రోజువారీ పనులు చేయడంలో ఇబ్బంది, త్వరగా గాయాలు కావడం వంటి సమస్యలు కనిపిస్తాయి. కండరాల బలం తగ్గిపోవడం వల్ల పడిపోవడం, గాయపడే ప్రమాదం కూడా పెరుగుతుంది. అదేవిధంగా శరీరంలో ఇన్సులిన్ స్పందన తగ్గి, భవిష్యత్తులో జీవక్రియ సంబంధిత వ్యాధుల ప్రమాదం కూడా పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

**ప్రోటీన్లు ముఖ్యం..**

ఆరోగ్యంగా బరువు తగ్గాలంటే సరైన విధానాన్ని అనుసరించడం చాలా ముఖ్యం. శరీర బరువు ప్రతి కిలోకు 1.2 నుంచి 1.6 గ్రాముల వరకు ప్రోటీన్ తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. వారానికి మూడు నుంచి నాలుగు సార్లు రెసిస్టెన్స్ ట్రైనింగ్ లేదా బలం పెంచే వ్యాయామాలు చేయడం వల్ల కండరాలు కాపాడుకోవచ్చు. అలాగే శరీరానికి అవసరమైన సూక్ష్మ పోషకాలు అందేలా సమతుల ఆహారం తీసుకోవాలి. అవసరమైతే వైద్యుల సలహాతో సప్లిమెంట్లు వాడవచ్చు. బరువు తగ్గే సమయంలో కండరాల స్థాయి, ఎముకల దృఢత్వం, మెటబాలిజం వంటి అంశాలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. త్వరగా బరువు తగ్గడమే లక్ష్యం కాకుండా, ఆరోగ్యంగా, బలంగా మారడమే అసలు లక్ష్యంగా ఉండాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సరైన ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం, వైద్యుల పర్యవేక్షణతో బరువు తగ్గితేనే దీర్ఘకాలికంగా ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు.

# చిన్నారుల్లోనూ వస్తున్న ఫ్యాటీ లివర్ సమస్య..

## ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త అంటున్న వైద్యులు..



పిల్లల్లో ఫ్యాటీ లివర్ సమస్య గత కొన్నేళ్లుగా ఆందోళనకరంగా పెరుగుతోంది. ఒకప్పుడు పెద్దవారిలో మాత్రమే కనిపించిన ఈ సమస్య ఇప్పుడు చిన్నారుల్లో కూడా నమోదవుతుండటం వైద్య నిపుణులను కలవరపెడుతోంది. అధికంగా జంక్ ఫుడ్ తీసుకోవడం, గంటల కొద్దీ మొబైల్ లేదా టీవీ ముందు గడపడం, శారీరక శ్రమ తగ్గిపోవడం, బాల్యంలోనే ఊబకాయం పెరగడం వంటి అంశాలు దీనికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం వల్ల ప్రారంభమయ్యే ఈ సమస్యను తొలిదశలోనే గుర్తిస్తే జీవనశైలిలో మార్పులతో నియంత్రించవచ్చు. అయితే లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే కాలేయ నష్టం, సిరోసిస్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కారణం లేకుండానే అలసట..

పిల్లల్లో ఎలాంటి కారణం లేకుండానే తరచూ అలసట కనిపించడం ఫ్యాటీ లివర్‌కు సంకేతం అని అంటున్నారు. పెద్దగా శారీరక శ్రమ చేయకపోయినా పిల్లలు ఎప్పుడూ నీరసంగా ఉండటం, శక్తి తగ్గిపోవడం, సాధారణ పనులకే అలసిపోవడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు గమనించాలి. శరీరంలో శక్తి స్థాయిలు తగ్గిపోవడం కాలేయ పనితీరు దెబ్బతినడానికి సూచనగా భావించాలి. చర్మంలో వచ్చే కొన్ని మార్పులు కూడా ఫ్యాటీ లివర్ ప్రమాదాన్ని సూచిస్తాయి. ముఖ్యంగా మెడ చుట్టూ నల్లని మచ్చలు కనిపించడం, చర్మం కాంతి కోల్పోవడం లేదా అనారోగ్యంగా కనిపించడం వంటి లక్షణాలు ఇన్సులిన్ రెసిస్టెన్స్‌తో పాటు కాలేయ సమస్యలకు సంకేతాలుగా ఉంటాయి. ఇలాంటి మార్పులను తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

తరచూ జీర్ణ సమస్యలు..

పిల్లలకు తరచూ కడుపు ఉబ్బరం, కుడి వైపు పై భాగంలో స్వల్ప నొప్పి లేదా అసౌకర్యం ఉండటం కూడా ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన లక్షణంగా భావించాలి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లతో సంబంధం లేకుండా ఈ సమస్య పదేపదే వస్తుంటే జాగ్రత్త అవసరం. కాలేయం ఒత్తిడికి గురైనప్పుడు ఇలాంటి సంకేతాలు కనిపించే అవకాశముంటుంది. నగర ప్రాంతాల్లో పిల్లల్లో ఫ్యాటీ లివర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రాసెస్డ్ ఫుడ్, అధిక చక్కెర ఉన్న పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయ కణాల్లో కొవ్వు పేరుకుపోతుంది. శారీరక చలనం తగ్గిపోవడం వల్ల ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం కూడా సమస్యను మరింత పెంచుతోంది. మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్స్ కారణంగా పిల్లలు బయట ఆడుకోవడం తగ్గించడంతో ప్రమాదం పెరుగుతోంది.

అధిక బరువు..

అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న పిల్లల్లో ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కుటుంబంలో మధుమేహం చరిత్ర ఉన్నా ప్రమాదం పెరుగుతుంది. అధిక చక్కెర ఉన్న ఆహారాలను తరచూ తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం వంటి అంశాలు కూడా కాలేయంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఫ్యాటీ లివర్‌ను తొలి దశలో గుర్తిస్తే పిల్లల్లో పూర్తిగా నియంత్రించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గ్రేడ్-1 దశలో జీవనశైలిలో మార్పులు తీసుకొస్తే కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. బయట ఆటలను ప్రోత్సహించడం, పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలతో కూడిన ఆహారం ఇవ్వడం, జంక్ ఫుడ్, చక్కెర పానీయాలను తగ్గించడం చాలా ముఖ్యం. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించడం ద్వారా సమస్యను ముందుగానే గుర్తించవచ్చు. పిల్లల్లో నిరంతర అలసట, చర్మంలో మార్పులు, అకస్మాత్తుగా బరువు పెరగడం లేదా రక్తపరీక్షల్లో అసాధారణ ఫలితాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరం. చిన్న చిన్న జీవనశైలి మార్పులు పిల్లలను దీర్ఘకాలిక కాలేయ సమస్యల నుంచి కాపాడుతాయి.

# 40 ఏళ్ల తర్వాత బరువు తగ్గడం కష్టమవుతుందా?



ఇంటర్నెట్ డెస్క్: 40 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత మన శరీరంలో చాలా మార్పులు వస్తాయి. ఈ సమయంలో బరువు తగ్గడం చాలా మందికి కష్టంగా మారుతుంది. దీనికి అనేక కారణాలు ఉంటాయి. ఆరోగ్య పరంగా 40 ఏళ్లు ఒక ముఖ్యమైన దశ. ఈ వయస్సు తర్వాత శరీరం మార్పులు చూపించడం మొదలుపెడుతుంది. కొందరికి బరువు పెరగడం పెద్ద సమస్యగా మారుతుంది.

**నెమ్మదిగా జీవక్రియ**

వయస్సు పెరిగేకొద్దీ శరీరంలో జీవక్రియ నెమ్మదిస్తుంది. దీంతో శరీరం తక్కువ కేలరీలు మాత్రమే ఖర్చు చేస్తుంది. చిన్న వయస్సులో తీసుకున్నంత ఆహారం తీసుకుంటే, అదనపు శక్తి కొవ్వుగా మారుతుంది.

**కండరాలు తగ్గిపోవడం**

40 ఏళ్ల తర్వాత కండరాల శక్తి తగ్గిపోతుంది. వ్యాయామం చేయకపోతే ఈ సమస్య ఎక్కువ అవుతుంది. కండరాలు తగ్గితే శరీరం కేలరీలను తక్కువగా ఖర్చు చేస్తుంది.

**హార్మోన్ల మార్పులు**

హార్మోన్ల మార్పులు కూడా బరువుపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా మహిళల్లో మెనోపాజ్ సమయానికి ఈస్ట్రోజెన్ స్థాయి తగ్గుతుంది. దీని వల్ల బరువు పెరగడం సులభమవుతుంది.

**శారీరక చురుకుదనం తగ్గడం**

ఈ వయస్సులో చాలామంది శారీరక శ్రమను తగ్గిస్తారు. వ్యాయామం చేయకపోవడం, ఎక్కువగా కూర్చుని ఉండటం వల్ల శరీరం కేలరీలు తక్కువగా ఖర్చు చేస్తుంది.

**ఒత్తిడి కూడా కారణం**

ఈ దశలో కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ ఒత్తిడి ఎక్కువగా ఉంటాయి. పిల్లలు, తల్లిదండ్రులు, పని బాధ్యతల వల్ల ఒత్తిడి పెరుగుతుంది. ఒత్తిడి, నిద్రలేమి కూడా బరువు తగ్గడాన్ని కష్టతరం చేస్తాయి.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.